టాప్ న్యూస్



ఇజ్రాయెల్ ఇరాన్ ఘర్షణలపై భారత్

## మౌనం వీడాలి

- లక్షలాది మంది భారతీయ పౌరులు పశ్చిమాసియాలో నివసిస్తున్నారు
- దౌత్య మార్గాలను భారత్ ఉపయోగించి చర్చలు జరపాలి
- ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ

02



## ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమే..

- పోలైన ఓట్ల వివరాలు అడిగితే ఈసీ నిరాకరిస్తోంది
- సీసీటీవీ ఫుటేజ్ 45 రోజులకు తొలగించడం దారుణం
- ఈసీపై ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు

03



## పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే

- సింధూ నదీ జలాల ఒప్పందం పునరుద్ధరణ ఉండదని అమిత్ షా స్పష్టం
- పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణ
- పాక్‌కు వెళ్లే నీటిని కెనాల్ ద్వారా రాజస్థాన్‌కు మళ్లిస్తామని వెల్లడి

03


ANN తెలుగు

Follow: @ANNTELUGU

22-06-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 199 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## రప్పా రప్పా రాజకీయాలు

తెలంగాణ ఆంధ్రాలో రప్పారప్పా రాజకీయాలు సాగుతున్నాయి. హరీష్ రావు పర్యటనలో 2028లో రప్పారప్పా 3.0 పేరుతో ఫ్లకార్డులు ప్రదర్శించడం గులాబీపార్టీలో చర్చనీయాంశంగా మారింది. హరీష్ ను బిఆర్ఎస్ క్యాడర్ సీఎంగా చూడాలనుకుంటున్నారా? తాజా నినాదం వెనుక వ్యూహంపై చర్చ జరగుతోంది. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని ప్రకటించిన కవిత తన కార్యక్రమాలు, నిర్ణయాలలో కన్ఫ్యూజన్ తో క్యాడర్ ను కూడా గందరగోళంలో పడేస్తున్నది. బనకచర్ల వివాదాన్ని లేవనెత్తిన బిఆర్ఎస్ ఇందుకు బీజం వేసింది కేసీఆరే అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎదురుదాడికి దిగడంతో ఆత్మరక్షణలో పడింది. లోకేష్ పై యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రశంసలు భవిష్యత్తుకు సంకేతంగా నిలుస్తున్నాయి.

- తాజా రాజకీయాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

## ఇకపై ఎమర్జెన్సీ సేవలన్నింటికీ 112

- తెలంగాణలో అమల్లోకి అత్యవసర నెంబర్
- పోలీస్, ఫైర్, రోడ్డు ప్రమాదాలు, మెడికల్, ఉమెన్, చిల్డ్రన్ సర్వీసులు
- 112 డయల్ చేయగానే జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసి నేరుగా సేవలు

వివరాలు 2లో



## రేపు క్యాబినెట్ సమావేశం

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ
- ప్రధానంగా బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ
- స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా చర్చించే అవకాశం

వివరాలు 2లో



## బనకచర్ల ప్రాజెక్టును ఆపాల్సిందే

- రాష్ట్రంలో మార్పు తేవాలనే ప్రయత్నంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చాము
- గత ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేసి అరెస్టులు చేసేది
- కాళేశ్వరం కట్టి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశాడు
- రంగారెడ్డి జిల్లా తెలంగాణ జన సమితి ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం

వివరాలు 3లో



# అండర్ గ్రౌండ్‌లోకి అరవింద్ కుమార్

### ఏ2 అజ్ఞాతంపై సీఎం సీరియస్

- యూరప్ పర్యటనపై అనుమానాలు
- లండన్ లోనే కేటీఆర్
- సెలవులు రద్దుచేసినా వెంటనే రాని అర్వింద్
- ప్రభాకర్ రావు తరహాలో కొత్త గేమ్ ఆడతారా?
- ఫార్ములా ఈ-రేస్ కేసు నోటీసులిచ్చేందుకు అందుబాటులో లేని ఐఎఎస్
- రూ.55 కోట్ల ప్రభుత్వ సొమ్ము అప్పనంగా.. ఇచ్చేసిన అర్వింద్ కుమార్

వివరాలు 3లో

అరవింద్ కుమార్ ఎక్కడ? తెలంగాణ ప్రభుత్వ వర్గాల్లో, పొలిటికల్ సర్కిల్స్ లో దీనిపై హాట్ టాపిక్ గా మారింది. సీనియర్ ఐఎఎస్ అర్వింద్ కుమార్ యూరప్ పర్యటనకు వెళ్ళినట్లు ప్రచారం ఉండగా, మాజీ మంత్రి కేటీఆర్ కూడా లండన్ వెళ్ళడం చర్చనీయాంశంగా మారింది. ప్రభాకర్ రావు విషయంలోనూ కేటీఆర్ అమెరికా పర్యటన తర్వాతే ఇండియాకు వచ్చేందుకు ఆయన ప్లాన్ చేసుకున్నారు. ఏడాదిన్నర కాలం నాన్చారు. ఇపుడు ఏ2గా ఉన్న అరవింద్ కుమార్, ఇప్పటికే ఈడి, ఏసీబీ విచారణలకు హాజరైన అరవింద్ కుమార్ ముఖ్యమంత్రితో పాటు సదరు ఏజెన్సీలకు సమాచారం లేకుండా దేశం విడిచి వెళ్ళడం ఆకస్మికంగా మారింది. చాలా కాలంగా దీనిపై ప్రభుత్వానికి సమాచారం కూడా లేదు. ఏసీబీ అధికారులు కేటీఆర్ కు నోటీసు ఇచ్చినపుడు, అర్వింద్ కుమార్ కు కూడా నోటీసులివ్వాలని భావించడంతో ఆయన దేశంలోనే లేడని తెలిసింది. ముఖ్యమంత్రి కూడా తనకు సమాచారం లేకుండా సీనియర్ ఐఎఎస్ కు సెలవులు ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

- మహా, హైదరాబాద్

# పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు.. బెయిల్

### క్వారీ యజమానికి ఎమ్మెల్యే బెదిరింపులు

**అరెస్టు చేసిన పోలీసులు.. కోర్టులో హాజరు**

సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ లీడర్ల హంగామా

కౌశిక్ రెడ్డి అరెస్ట్ అక్రమమంటూ ఆందోళన.. ఉద్రిక్తత

విచారించిన కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

నేను భయపడ.. అరెస్టు చేస్తే ఏకే 47ను అవుతానని వ్యాఖ్య



**వరంగల్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బిగ్ రిలీఫ్ దక్కింది. క్వారీ యజమానిని బెదిరించిన కేసులో బెయిల్ మంజూరైంది. కాజీపేట రైల్వే కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆయన అరెస్ట్ పై ఉదయం నుండి హైడ్రామా కొనసాగింది. కౌశిక్‌ది అక్రమ అరెస్ట్ అంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. బెయిల్ అనంతరం మీడియాతో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా లీగల్ టీమ్ కు పేరు పేరునా కృతజ్ఞతలు.

మిగతా 3లో

## ఇది బేడీల రాజ్యం

- రైతు బంధు ఇవ్వకపోతే ఓఆర్ ఆర్ పై వంటావార్పు
- రైతులకు రుణమాఫీ విషయంలో తీవ్ర అన్యాయం
- రైతుబంధు ఇచ్చేవరకు పోరాటం చేస్తా
- మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

02



# రూ. 500 కోట్ల ఘరానా మోసం

### బోర్డు తిప్పేసిన ఏపీ ఇన్‌ఫ్రా

18 నెలలకు 50 శాతం అదనంగా ఇస్తామని రూ. 500 కోట్లు వసూలు

గడువు పూర్తయిందని ప్రశ్నిస్తే మరో చోట వెంచర్ అని దాటవేత

బ్లాంక్ చెక్కులు ఇచ్చి తప్పించుకున్న విజయ్ గోగుల

నకిలీ రియల్టర్ కోసం గాలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, మహా :** ఐటీ కేంద్రాలకు నిలయమైన మాదాపూర్ లో మరో ఘరానా మోసం బయటపడింది. రియల్ ఎస్టేట్ వ్యాపారమంటూ ఏపీ ఇన్‌ఫ్రా పేరిట కంపెనీని స్థాపించిన విజయ్ గోగుల అనే వ్యక్తి పెట్టుబడులకు భారీ లాభాలంటూ ఆశ చూపించి మోసానికి పాల్పడ్డాడు. వందలాది మంది పెట్టుబడిదారులని ఆకర్షించి అధిక లాభాల

మిగతా 2లో





## డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతాం

- విద్యార్థులు వాటి జోలికి వెళ్లొద్దు
- ఒక్కో విద్యార్థి పదిమందికి సే నోటు డ్రగ్స్ అని చెప్పాలి
- తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరిక
- డ్రగ్స్ అవేర్నెస్ వీక్‌ని ప్రారంభించిన ఉన్నతాధికారులు

03

# యోగాంధ్ర గిన్నిస్ రికార్డు

### ప్రధాని మోదీ సమక్షంలో ఘనత

యోగా భారతావనికి దక్కిన గొప్ప గౌరవం

'యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' నినాదంతో కార్యక్రమం

ఏకంగా 3.01 లక్షల మందితో యోగాసనాలు

కొత్త రికార్డు.. గతంలో సూరత్‌లో 1.47 లక్షల మందితో

యోగా ప్రపంచ దేశాలను కలిపింది: మోదీ

**విశాఖపట్నం, మహా:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర2025 కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు యోగాంధ్ర గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ కార్యక్రమంలో 3.01 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో సూరత్‌లో 1.47 లక్షల మందితో నిర్వహించిన యోగా రికార్డును యోగాంధ్ర అధిగమించింది.

మిగతా 2లో



## ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణలపై

# భారత్ మౌనం వీడాలి

- లక్షలాది మంది భారతీయ పౌరులు పశ్చిమాసియాలో నివసిస్తున్నారు
- దౌత్య మార్గాలను భారత్ ఉపయోగించి చర్చలు జరపాలి
- ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ



**న్యూఢిల్లీ, మహా :**
గాజా, ఇరాన్‌లోని ఇజ్రాయెల్ విధ్వంసంపై భారత్ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈ దాడులపై కేంద్రం మౌనం పాటించడం దేశ నైతిక, దౌత్య సంప్రదాయాలను విస్మరిస్తున్నట్లు ఉందన్నారు. ఓ ప్రముఖ దినపత్రికకు రాసిన వ్యాసంలో ఈ మేరకు సోనియా పేర్కొన్నారు. ఇప్పటికైనా సమయం మించిపోలేదనీ, ఈ రెండు అంశాల్లో భారత్ తన గొంతుకను వినిపించాలని సూచించారు. భారత్ స్పష్టంగా మాట్లాడాలనీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సోనియా గాంధీ చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, చర్చల కోసం అందుబాటులో ఉన్న ప్రతీ దౌత్య మార్గాన్ని ఉపయోగించాలని సోనియా గాంధీ సూచించారు.
సార్వభౌమ, స్వతంత్ర పాలస్తీనాకు సంబంధించిన భారత దీర్ఘకాలిక నిబద్ధతను మోదీ ప్రభుత్వం వదిలేసిందని సోనియా విమర్శించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును సైతం సోనియా తప్పుబట్టారు. యుద్ధాలకు వ్యతిరేకంగా మాట్లాడిన ట్రంప్ పశ్చిమాసియాలో విధ్వంసకర మార్గాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. ఏకపక్ష సైనికవాదానికి సంబంధించిన ప్రమాదకరమైన పరిణామాలను ఈ నెల 13న ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల తర్వాత ప్రపంచం చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు గాజాలోని పౌరుల జీవితాలను, ప్రాంతీయ స్థిరత్వాన్ని పూర్తిగా విస్మరించాయని సోనియా గాంధీ పేర్కొన్నారు. 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, చాలా మంది కరువు కోరల్లో చిక్కుకుపోయి ఎన్నో కష్టాలను అనుభవిస్తున్నారన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడులను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఖండించింది. అయితే ఇజ్రాయెల్ దాడులను చూస్తూ మనం మౌనంగా ఉండలేమన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో నాయకత్వం శాంతిని దెబ్బతీసి, ఉగ్రవాదాన్ని పెంపొందించే దురదృష్టకర రికార్డును కలిగి ఉందని సోనియా గాంధీ ఆరోపించారు.

భారత్ బాధ్యతాయుతంగా వ్యవహరించి పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలను తగ్గించడానికి చర్చలకు రావడానికి అనువుగా ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని ఉపయోగించాలన్నారు. లక్షలాది మంది భారతీయ పౌరులు పశ్చిమాసియా అంతటా నివసిస్తున్నారు. భారత్ ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాలను అనుసరించి ఇరుదేశాల ఉద్రిక్తతలను తగ్గించడం నైతిక బాధ్యత అన్నారు. ఇరాన్ భారత్‌కు దీర్ఘకాల స్నేహితుడని, అలాగే ఇరుదేశాలకు లోతైన నాగరిక సంబంధాలు ఉన్నాయని అన్నారు. జమ్మూ కాశ్మీర్ అంశంపై సహా కీలక సమయాల్లో భారత్‌కు ఇరాన్ మద్దతు ఉందన్నారు. 1994లో కాశ్మీర్ సమస్యపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్‌లో భారతదేశాన్ని విమర్శించే తీర్మానాన్ని నిరోధించడంలో ఇరాన్ సహాయపడిందని పేర్కొన్నారు.

# యోగాంధ్ర గిన్నిస్ రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్ నుండి భీమిలి వరకు లక్షల మంది ఒకేసారి యోగాసనాలు వేసి రికార్డు సృష్టించారు. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భీమిలి తీరం వరకు దాదాపు 26 కిలోమీటర్ల పరిధిలో లక్షల మంది యోగాసనాలు వేశారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు రికార్డుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా ప్రజా ప్రతినిధులు ఈ యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

**కోట్ల మంది జీవితాల్లో వెలుగులు..**


ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. 'అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసింది. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారు. యోగాకు వయసుతో పనిలేదు.. యోగాకు హద్దులు లేవు' అని మోదీ అన్నారు.

**మంత్రి లోకేశ్ పాత్ర కీలకం..**

'ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుంది. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుంది. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయి. యోగా వల్ల శాంతి స్థిరత్వం సాధించవచ్చు' అని మోదీ పేర్కొన్నారు. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు.

**సీఎం చంద్రబాబు హర్షం..**

యోగాంధ్ర విజయవంతమవడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ కలెక్టరేట్‌లో



మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష చేపట్టారు. యోగాంధ్రలో 3 లక్షల మందికిపైగా పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతోనే ఇది గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పేర్కొన్నారు. గిన్నిస్ రికార్డులు సాధించడంపై ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన యోగా డే తీరుపై సీఎం అధికారులతో చర్చించారు.

# డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతాం

## విద్యార్థులు వాటి జోలికి వెళ్లొద్దు

### ఒక్కో విద్యార్థి పదిమందికి సే నోటు డ్రగ్స్ అని చెప్పాలి

### తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరిక

### డ్రగ్స్ అవేర్నెస్ వీక్‌ని ప్రారంభించిన ఉన్నతాధికారులు

**హైదరాబాద్, మహా:** డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల చాలా అనర్థాలు జరుగుతాయని అన్నారు. యువత వీటి బారిన పడొద్దని.. విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రభుత్వం, పోలీసులు కృతనిశ్చయంతో పని చేస్తున్నారని అన్నారు. శనివారం తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్నెస్ వీక్‌ని డీజీపీ జితేందర్ ప్రారంభించారు. జూన్ 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు నార్కోటిక్ బ్యూరో అవగాహన కల్పించనుంది. డ్రగ్ అవేర్నెస్ వీక్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, టీజీఏ ఎన్బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దురదృష్టవశాత్తూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మెంటల్ హెల్త్‌తో పాటు ఫిజికల్ హెల్త్‌ను నాశనం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు మీ జీవితం అనే పుస్తకంలో మంచి విషయాలు మీరే రాసుకోవాలని సూచించారు. నో టు డ్రగ్స్ అనే నినాదం జనాల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఫ్రెండ్స్, కుటుంబ సభ్యుల్లో ఒక్కో విద్యార్థి పదిమందికి సే నోటు డ్రగ్స్ అని చెప్పాలని డీజీపీ జితేందర్ కోరారు.

**సే నోటు డ్రగ్స్ అనే నినాదం..**

విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని టీజీఏ




ఎన్ బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులతో యాంటీ డ్రగ్ సోల్జర్‌స్‌గా సందీప్ శాండిల్య ప్రమాణం చేయించారు. డ్రగ్స్ వ్యతిరేకంగా పని చేస్తామని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లమని విద్యార్థులు ప్రమాణం చేశారు.పాఠశాలల్లో డ్రగ్స్‌ని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పని చేస్తామని విద్యార్థులతో కలెక్టర్ హరిచందన ప్రమాణం చేయించారు. సే నోటు డ్రగ్స్ అనే నినాదం అందరికీ చేరేలా చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం విద్యార్థులు అందరూ పని చేయాలని కలెక్టర్ హరిచందన కోరారు.

# రూ. 500 కోట్ల ఘరానా మోసం

(మొదటిపేజీ తరువాయి)

ఆశ చూపి బోర్డు తిప్పేశాడు. జరిగిన మోసాన్ని గ్రహించిన బాధితులు గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఈ దందా బయటకు వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ పోలీసులు మీడియాకు వెల్లడించారు. మాదాపూర్ కేంద్రంగా బై బ్యాక్ పేరుతో ఏవీ ఇన్‌ఫ్రా చైర్మన్ విజయ్ గోగుల భారీ ఎత్తున డబ్బులను వసూలు చేశాడు. ఏవీ ఇన్‌ఫ్రాలో పెట్టుబడి పెట్టిన వారికీ డబుల్ అమౌంట్ ఇస్తామని, ఇవ్వకపోతే ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చాడు. నారాయణఖేడ్, యాదగిరిగుట్ట, బుదేరా తదితర ప్రాంతాల్లో వెంచర్‌లు అంటూ విజయ్ గోగుల నమ్మించాడు. 18 నెలలకు 50శాతం అదనంగా ఇస్తానని చెప్పి చివరికి విజయ్ గోగుల చేతులెత్తేశాడు. తీరా బాధితులు అడిగే సరికి 18 నెలల తర్వాత ఇంకో ప్రాజెక్ట్ ఉందని, అక్కడ ఇస్తాను అంటూ దాటవేశాడు. బాధితులు గట్టిగా అడిగితే బ్లాంక్ చెక్‌లు ఇస్తూ తప్పించుకొని విజయ్ గోగుల తిరుగడం ప్రారంభించాడు. మాదాపూర్ దుర్గం చెరువు దగ్గర ఏవీ ఇన్‌ఫ్రా కార్యాలయం కేంద్రంగా ఈ దందా జరిగింది. సుమారుగా 500 మంది వరకు బాధితులు మోసపోయారు. రూ.500 కోట్ల వరకు ఏవీ ఇన్‌ఫ్రా మోసానికి పాల్పడింది. రాజీ అనే వృద్ధుడు దాదాపు రూ.84 లక్షల వరకు ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. ఇలా అనేక మంది తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టారు. బాధితుల ఫిర్యాదుతో ఏవీ ఇన్‌ఫ్రా చైర్మన్ విజయ్ గోగులపై మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విజయ్ గోగులపై గతంలోనూ ఏమైనా కేసులు ఉన్నాయా అనే కోణంలో మాదాపూర్ పోలీసులు విచారణ చేస్తున్నారు. నిందితుల కోసం పోలీసులు వెతుకుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. విజయ్ గోగుల కాల్ డేటాను, బ్యాంకు లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితులు ఆందోళన చెందవద్దని.. న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు తెలిపారు.

# ఇకపై ఎమర్జెన్సీ సేవలన్నింటికీ 112

- తెలంగాణలో అమల్లోకి అత్యవసర నెంబర్
- పోలీస్, ఫైర్, రోడ్డు ప్రమాదాలు, మెడికల్, ఉమెన్, చిల్డ్రన్ సర్వీసులు
- 112 డయల్ చేయగానే జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసి నేరుగా సేవలు




**హైదరాబాద్, మహా:**
రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎమర్జెన్సీ సర్వీసుల సేవల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా అన్ని అత్యవసర పరిస్థితులకు ఒకే నంబర్‌ను తీసుకొచ్చింది. తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్‌ను 112 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది. దేశంలో అత్యవసర సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ నంబర్ 112 ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిని తెలంగాణలో అమలులోకి తీసుకొచ్చారు. వివిధ ఎమర్జెన్సీ సేవలకు వేర్వేరు నంబర్లకు డయల్ చేయాల్సిన అవసరం లేకుండా అన్నింటికి ఈ ఒక్క నంబర్ ద్వారానే సాయం అందించనున్నారు. పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్, మహిళలు పిల్లల భద్రత, విపత్తు సహాయం కోసం వివిధ నంబర్ల గందరగోళం లేకుండా 112 నంబర్‌కు కాల్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ప్రజల భద్రతే తమ బాధ్యత అని పేర్కొంది.

**112 కింద కవర్ చేయబడే సేవలు..**

- పోలీసు సహాయం (నేరం, దొంగతనం, ప్రమాదాలు)
- అగ్ని ప్రమాద అత్యవసర పరిస్థితులు
- వైద్య అత్యవసర పరిస్థితులు
- రోడ్డు ప్రమాదాలు
- ఆపదలో ఉన్న మహిళలు/పిల్లలు
- ప్రకృతి వైపరీత్యాలు
- ఇక, డయల్112 అనేది కేవలం ఒక నంబర్ కాదని, ఇది ఒక లైఫ్‌లైన్ అని ప్రభుత్వం పేర్కొంది. ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితిలో 112ని ఉపయోగించాలని కోరింది.

# ఎడ్‌సెట్ ఫలితాలు రిలీజ్

## ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి కె. ప్రతాప్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు రిజల్ట్స్ రిలీజ్ చేశారు. కాగా ఎడ్‌సెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://edcet.tgche.ac.in ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఫలితాల కోసం హాల్‌టికెట్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలు ఉపయోగించాలి. ఈ ఫలితాలతో, రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సులో చేరదలచిన విద్యార్థులకు మరో ముందడుగు పడింది. అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జూన్ 1న రెండు సెషన్‌ల్లో బీఈడీ కోర్సులో ప్రవేశానికి ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష అనంతరం విడుదల చేసిన ప్రాథమిక కీ పై అభ్యర్థుల అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత అధికారులు ఫైనల్ కీను తయారుచేసి, అదే ప్రకారం ఫలితాలను ప్రకటించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని పరీక్ష నిర్వహకులు తెలిపారు. ఈ ఎగ్జామ్ కోసం మొత్తం 38,758 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 32,106 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థులలో 30,944 మంది అర్హత సాధించగా.. 96.38%గా ఉత్తీర్ణత శాతం నమోదైంది.

### టాప్ ర్యాంకర్స్ వీళ్లే

ఈ సంవత్సరం ఎడ్‌సెట్‌లో టాప్ స్కోర్లు సాధించిన వారిలో ఫస్ట్ ర్యాంక్ హైదరాబాద్‌కు చెందిన గణపతి శాస్త్రి దక్కించుకోగా, రెండవ ర్యాంక్‌ను హైదరాబాద్‌కే చెందిన శరత్‌చందర్ నిలిచారు. మూడవ ర్యాంక్‌ను వరంగల్‌కు చెందిన నాగరాజు నిలిచారు.

# రేపు క్యాబినెట్ సమావేశం

## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ

### ప్రధానంగా బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ

### స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా చర్చించే అవకాశం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రేపు జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టులపై, స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

**బనకచర్లపై ఏపీతో చర్చలు..**

ఈ సమావేశం అనంతరం బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానించనుంది తెలంగాణ ప్రభుత్వం. విభజన చట్టంలోని పరిమితులకనుగుణంగా బనకచర్ల అనుబంధ ప్రాజెక్టుగా ఉండటాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో స్పష్టతనిచ్చారు. ఆయన్ను ఉటంకిస్తూ "ఏపీతో చర్చలు అవసరం. వివాదాలకు కాదు, పరిష్కారాలకు మేము సిద్ధం" అని తెలిపారు.

**స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ**

క్యాబినెట్ సమావేశంలో మరో ముఖ్య అంశం స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చే కానుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ స్థాయిలో జరిగే ఎన్నికల షెడ్యూల్‌పై ప్రాథమిక చర్చ జరిగే అవకాశం ఉంది. తద్వారా స్థానిక పాలనను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ యోచన స్పష్టమవుతోంది. క్యాబినెట్ నిర్ణయాల ద్వారా ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# సీఎం రేవంత్ భేష్

## సీపీఐ నేత నారాయణ

**హైదరాబాద్, మహా :** బనకచర్ల ప్రాజెక్ట్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఐ నేత నారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చొని.. ఈ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. వెనకబడిన ప్రాంతాలకు నీరు అందేలా కృషి చేయాలని అన్నారు. ఎవరికీ నష్టం లేకుండా ప్రభుత్వాలు చూడాలని తెలిపారు. "గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా ఇతర జల వివాదాలపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులం కలిసి కూర్చుని మాట్లాడుకుందామని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించడం స్వాగతించాల్సిన అంశమన్నారు. ఈనెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉంది. అందులో చర్చించి, ఆ తర్వాత నేనే ఒకడుగు ముందుకేసి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించడాన్ని నారాయణ గుర్తు చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి ఏపీ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్ఆర్) ఇవ్వడం వల్లే వివాదం మొదలైందని, పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేది కాదన్నారు. ఏపీతో విభేదాలు కోరుకోవడం లేదంటూనే సీఎం రేవంత్ అలాగని రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడం ఆయనకున్న దూరదృష్టిని తెలియజేస్తుందన్నారు. ఇద్దరం కూర్చొని మాట్లాడుకుందాం.. సమస్యను పరిష్కరించుకుందామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, ఇదే సమస్య పరిష్కారానికి అసలైన మార్గమని నారాయణ అన్నారు.

# ఇది బేడీల రాజ్యం

- రైతు బంధు ఇవ్వకపోతే ఓఆర్ ఆర్ పై వంటావార్పు
- రైతులకు రుణమాఫీ విషయంలో తీవ్ర అన్యాయం
- రైతుబంధు ఇచ్చేవరకు పోరాటం చేస్తా
- మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు




**జిన్నారం, మహా:** దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతులకు బేడీలు వేసి రాష్ట్ర పరువును బజారులో వేసిన ఘనత రేవంత్ రెడ్డే అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. జిన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుబంధు నిధుల కోసం రైతుల ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి రెండు లక్షల ఎకరాలకు రైతుబంధును ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదన్నారు. పటాన్చెరువు రైతులు చేసిన పాపం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏతులకు పోయి పదికి పదిహేను ఇస్తాను అని కోతలు కోసిన ఏతుల రాయుడు నేడు రైతుబంధును ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్, కరెంటు కోతలు, తులం బంగారం, మహిళలకు రూ.2500, వృద్ధులకు 4000 పింఛన్, ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని కోతలే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో అలజడి సృష్టించి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నేలకూల్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆనాడు ప్రతి గ్రామానికి వైకుంఠ దామాలు, పల్లె ప్రకృతి వనాలు, గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లను ఇచ్చిన ఘనత కేసీఆర్ దని గుర్తు చేశారు. నేడు ఇచ్చిన ట్రాక్టర్ కు డీజిల్ పోయలేని స్థితిలో గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయని, దీనికి కారణం రేవంత్ అసమర్థ పాలన అన్నారు.

**ఇది కోతల ప్రభుత్వం..**

ఆనాడు కేసీఆర్ హయాంలో రైతులకు వరినాట్ల సమయంలో రైతుబంధును ఇస్తే నేడు ఓట్ల సమయంలో ఇచ్చే విధంగా రేవంత్ పాలన సాగుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఎమ్మెల్యేల జీతాలను బంద్ చేసి రైతులకు సహాయం అందించిన ఘనత కేసీఆర్ దని గుర్తు చేశారు. నాడు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న కోతల ప్రభుత్వం ఇంత వరకు దాని ఊసే లేదని గుర్తు చేశారు. రైతు చనిపోతే పది రోజుల్లో వారి కుటుంబానికి రైతు బీమా ద్వారా పది లక్షల రూపాయలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేవుళ్ళపై ఒట్టు పెట్టి మాట తప్పిన ఘనత ఎగవేతల రాయుడు రేవంత్ దే అన్నారు. లగచర్ల రైతుల భూముల హక్కులకై పోరాటం చేస్తే వారి చేతులకు బేడీలను వేసిన ఘనత ఎగవేతల రేవంత్ కి దక్కిందన్నారు.పాలన చేతకాక ప్రతిపక్షాలపై తన అక్కసును తీర్చుకోవడం సరైన పద్ధతి కాదని గుర్తు చేశారు. ప్రతిపక్షాలపై తప్పులను ఎత్తిచూపడం తప్ప పాలన సోయి లేకుండా గాడి తప్పుతుందని ఆయన అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం రైతులకు రైతుబంధు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని, ఇది ఆరంభం మాత్రమేనని ఆయన అన్నారు. లేనియెడల కలెక్టరేట్, ఓఆర్ఆర్ ను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. పోరాటం తమకేమీ కొత్త కాదని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తట్టుకునే దమ్ము ధైర్యం తమకు ఉందన్నారు.

# అండర్ గ్రౌండ్‌లోకి అరవింద్ కుమార్

## ఏ2 అజ్ఞాతంపై సీఎం సీరియస్

- యూరప్ పర్యటనపై అనుమానాలు
- లండన్ లోనే కేటీఆర్
- సెలవులు రద్దుచేసినా వెంటనే రాని అర్వింద్
- ప్రభాకర్ రావు తరహాలో కొత్త గేమ్ ఆడతారా?
- ఫార్ములా ఈరేస్ కేసు నోటీసులిచ్చేందుకు అందుబాటులో లేని ఐఏఎస్
- రూ.55 కోట్ల ప్రభుత్వ సొమ్ము అప్పనంగా.. ఇచ్చేసిన అర్వింద్ కుమార్

**హైదరాబాద్, మహా**

అరవింద్ కుమార్ ఎక్కడ? తెలంగాణ ప్రభుత్వ వర్గాల్లో, పొలిటికల్ సర్కిల్స్ లో దీనిపై హాట్ టాపిక్ గా మారింది. సీనియర్ ఐఏఎస్ అర్వింద్ కుమార్ యూరప్ పర్యటనకు వెళ్ళినట్లు ప్రచారం ఉండగా, మాజీ మంత్రి కేటీఆర్ కూడా లండన్ వెళ్ళడం చర్చనీయాంశంగా మారింది. ప్రభాకర్ రావు విషయంలోనూ కేటీఆర్ అమెరికా పర్యటన తర్వాతే ఇండియాకు వచ్చేందుకు ఆయన ప్లాన్ చేసుకున్నారు. ఏడాదిన్నర కాలం నాన్చారు. ఇపుడు ఏ2గా ఉన్న అరవింద్ కుమార్, ఇప్పటికే ఈడి, ఏసీబీ విచారణలకు హాజరైన అరవింద్ కుమార్ ముఖ్యమంత్రితో పాటు సదరు ఏజెన్సీలకు సమాచారం లేకుండా దేశం విడిచి వెళ్ళడం ఆకస్మికంగా మారింది. చాలా కాలంగా దీనిపై ప్రభుత్వానికి సమాచారం కూడా లేదు. ఏసీబీ అధికారులు కేటీఆర్ కు నోటీసు ఇచ్చినపుడు, అర్వింద్ కుమార్ కు కూడా నోటీసులివ్వాలని భావించడంతో ఆయన దేశంలోనే లేదని తెలిసింది. ముఖ్యమంత్రి కూడా తనకు సమాచారం లేకుండా సీనియర్ ఐఏఎస్ కు సెలవులు ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అర్వింద్ కుమార్ ఏ బంకర్ లో దాక్కున్నాడంటూ గత కొద్దిరోజులుగా ఎంపీలు, విపక్ష పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నా.. ఆయన అజ్ఞాతం వీడి రావడం లేదు. దీంతో అర్వింద్ కుమార్ కూడా మరో ప్రభాకర్ రావు అవుతాడా? అనే చర్చ సాగుతోంది.



**విచారించిన ఈడి**

గతంలో ఏ2గా ఉన్న అర్వింద్ కుమార్ ను ఏసీబీ అధికారులతో పాటు ఈడి అధికారులు కూడా విచారించారు. ఏ2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలు పలుమార్లు ఏసీబీ, ఈడీ విచారణకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన ఎంఏయుడి శాఖలో స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. హైదరాబాద్ ఫార్ములా ఈరేసు అగ్రిమెంట్ సమయంలో అరవింద్ కుమార్ అత్యంత కీలకంగా వ్యవహరించారు. కేటీఆర్ ఆదేశాలతో అర్వింద్ కుమార్ ఈ నిధుల బదిలీకి ఉత్తర్వులు ఇచ్చినట్లు వారే స్వయంగా చెప్పారు. ఈ క్రమంలోనే రూ.55 కోట్ల అక్రమ నగదు లావాదేవీలపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ రికార్డ్ చేశారు. ఇదే కేసులో మనీ లాండరింగ్, ఫెమా నిబంధనలను ఉల్లంఘించారనే అభియోగాలు ఉన్నాయి. హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. ఫార్ములా ఈరేసు 2 అగ్రిమెంట్ సమయంలో డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయటంతో బీఎల్ఎన్ రెడ్డి కీ రోల్ ప్లే చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. విదేశాలకు నిధులు ట్రాన్స్‌ఫర్ చేసే ముందు ఆర్‌బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదనే అంశాలపై ఈడీ బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించింది.

**నేరుగా చెప్పినా..**

కేటీఆర్ స్వయంగా నిధుల బదిలీకి ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో తానే ఆదేశాలిచ్చానని పలు మార్లు చెప్పారు. తాజాగా మళ్ళీ కేటీఆర్ ను విచారించారు. నిధులను బదిలీచేసిన అర్వింద్ కుమార్ కు నోటీసులిచ్చి తుది విచారణ చేయాలని భావించగా, ఆయన అందుబాటులో లేరు. గత పక్షం రోజులుగా ఆయన కోసం ఏసీబీ అధికారులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అర్వింద్ కుమార్ పై ఆరోపణలు వినబడుతున్నాయి.

**అర్వింద్ కుమార్ జాడ కేటీఆర్ చెప్పాలి**

ఫార్ములా కేసు విచారణ జరుగుతున్నప్పటి నుండి అరవింద్ కుమార్ కనిపించడం లేదని ఎంపీ చామల కిరణ్ చెప్పారు. ఆయన గురించి వెతుకుతున్నామని అన్నారు. కుట్రలో భాగంగానే అరవింద్ కుమార్ కనిపించకుండా పోయారని ఆరోపించారు. ఈ రోజే అరవింద్ కుమార్ పై ఎంక్వైరీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రావు ఎంక్వైరీలో పాల్గొంటున్నారు కానీ ఈ కేసులో అసలైన వ్యక్తి అరవింద్ కుమార్ విదేశాలకు వెళ్లిపోయారని అన్నారు. ప్రభాకర్ రావు మాదిరిగానే అరవింద్ కుమార్ కూడా అండర్ గ్రౌండ్ కు వెళ్లిపోయారని అనుమానం వ్యక్తం చేశారు. కేబినెట్ ఆమోదం లేకుండా జరిగిన రూ.55 కోట్ల ట్రాన్సాక్షన్‌లో అరవింద్ కుమార్ ముఖ్యమైన అధికారి అని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను అరెస్ట్ చేయాలన్నా అరవింద్ కుమార్‌ను విచారణ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

# పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే

## సింధూ నదీ జలాల ఒప్పందం పునరుద్ధరణ ఉండదని అమిత్ షా స్పష్టం

### పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణ

### పాక్‌కు వెళ్లే నీటిని కెనాల్ ద్వారా రాజస్థాన్‌కు మళ్లిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ, మహా :** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునఃప్రారంభించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలోని నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని, ఇన్నాళ్లూ అన్యాయంగా నీటిని పొందిందని, ఇకపై ఆ దేశం నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ, "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేము, కానీ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారతదేశానికి ఉంది. మేం అదే చేశాం" అని అన్నారు. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే అంశం ఉందని, అయితే ఒకసారి దాన్ని ఉల్లంఘించిన తర్వాత రక్షించడానికి ఏమీ మిగలదని ఆయన స్పష్టం చేశారు. భారతదేశానికి హక్కుగా దక్కిన నీటిని సంపూర్ణంగా వినియోగించుకుంటామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కెనాల్ నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే జలాలను రాజస్థాన్‌కు మళ్లిస్తామని ఆయన వివరించారు. "ఇంతకాలం పాకిస్థాన్ అన్యాయంగా నీటిని పొందింది. ఇకపై ఆ దేశం గొంతు ఎండిపోవాల్సిందే" అంటూ అమిత్ షా వ్యాఖ్యానించారు.

**పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం**

1960వ దశకంలో భారత్, పాకిస్థాన్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. అయితే, పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తర్వాత ఈ ఒప్పందం అమలును భారత్ నిలిపివేసింది. ఈ నిర్ణయం పాకిస్థాన్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆ దేశ నీటి సరఫరా వ్యవస్థ ప్రధానంగా సింధూ జలాలపైనే ఆధారపడి ఉంది. వ్యవసాయానికి వినియోగించే నీటిలో దాదాపు 80 శాతం ఈ ఒప్పందం ద్వారానే లభిస్తోంది. పాకిస్థాన్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 25 శాతం ఈ నదీ జలాల కారణంగానే వస్తుందంటే, భారత తాజా నిర్ణయం భవిష్యత్తులో ఆ దేశంపై ఎంతటి ప్రభావాన్ని చూపనుందో అర్థం చేసుకోవచ్చు.



# పాడి కౌశిక్ రెడ్డికి రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

నన్ను జైలుకు పంపడం కోసం నిన్నరాత్రి నుండి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారు. నన్ను జైలుకు పంపాలని ఎన్ని కుట్రలు చేసినా భయపడను. నేను ఏకే 47ను అవుతా. తెలంగాణలో మంత్రులు ఇసుక దందా, పేదల భూములు కబ్జా చేస్తున్నారు. అందరి అక్రమాలు ఆధారాలతో సహా బయట పెడతా. ఊహించిన సాక్ష్యాలతో ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం పెడతా అని కౌశిక్‌రెడ్డి అన్నారు.

**రూ.50 లక్షలు ఇవ్వాలని..**

కమలాపూర్ మండలంలో గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 308(2), 308(4), 352 కింద కేసులు నమోదు చేశారు. మనోజ్ రెడ్డి అనే వ్యక్తి కమలాపూర్ మండలంలోని వంగపల్లిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. కౌశిక్‌రెడ్డి తనను రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించినట్లు మనోజ్ రెడ్డి భార్య ఉమాదేవీ సుబేదారీ పీఎస్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే సుబేదారి పోలీసులు శనివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

**బీఆర్ఎస్ నేతల ఆందోళన..**

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టుతో సుబేదారి పోలీస్ స్టేషన్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కౌశిక్ రెడ్డి భార్య శాలిని రెడ్డి, కౌశిక్ సోదరుడు ప్రతీక్ రెడ్డి పలువురు బీఆర్ఎస్ నేతలు ఆయనను పరామర్శించేందుకు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లాయర్ తో కలిసి పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అలాగే బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి కూడా స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. దీంతో స్టేషన్ చుట్టూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఎంజీఎంలో వైద్య పరీక్షల అనంతరం ఆయనను పోలీసు కోర్టుకు తరలించారు.

# ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా అవసరం

## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** సమాజంలో ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు అనారోగ్యం బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ఆరోగ్య జీవనశైలిని అలవర్చుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఆరోగ్యం కుటుంబ సంక్షేమ మరియు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... యోగాకు నిత్యజీవితంలో ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గమనించాలని, ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అద్భుతమైన సాధన యోగా అని అన్నారు. యోగా అనేది శరీర వ్యాయమమే కాకుండా జీవన విధానంలో భాగమని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆనందంగా ఉండాలని గవర్నర్ అన్నారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ... యోగా ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన బహుమతి అని, "యోగా కేవలం వ్యాయామం కాదు, ఇది శరీరం, మనస్సు మరియు ఆత్మను ఏకం చేస్తుందని, ఆరోగ్య సమస్యలకు ఇది ఉత్తమ పరిష్కారం" అని అన్నారు. యోగా చేయడానికి దృఢ సంకల్పం మరియు మంచి గురువు అవసరమని, యోగ సాధన ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం తోపాటు ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా యోగాను అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులలో యోగాభ్యాసం ద్వారా ఒత్తిడిని నివారిస్తుందని ఏకాగ్రతను పెంపొందిస్తుందని, ప్రతి పాఠశాలలో యోగా తరగతులు నిర్వహించాలని ఈ యోగ సాధన ద్వారా విద్యార్థులకు మానసిక స్పష్టత, శారీరక బలం మరియు ఏకాగ్రతను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు. యోగ ధ్యానం అనేది ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడు సాధనమని ప్రపంచ సమాజానికి యోగా అనే గొప్ప వరాన్ని అందించిన మహర్షి పతాంజలి చిరస్మరణీయులను అన్నారు. క్రీడలు మరియు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసిన గడ్డ మన దేశమని, యోగాను అన్ని దేశాలకు చాటి చెప్పి వైద్యులకు పని లేకుండా ఆరోగ్యవంతులను కాపాడే సాధనమని అన్నారు. ప్రతిరోజు యోగ చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు చురుకుగా పని చేస్తారని, అదేవిధంగా యోగ ఎలాంటి వ్యాధులనైన నయం చేసే సాధనమని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత అలవర్చుకోవాలని అన్నారు. జబ్బు వస్తే ఎంతో ఖర్చు పెడతారని దానికి ముందే ఆరోగ్యంగా ఉండడానికి యోగా లాంటి అలవాట్లను పాటించినట్లయితే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఆరోగ్యశాఖ సెక్రటరీ క్రిస్టినాజో చొంగత్, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి. కర్ణన్, యువతి యువకులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమే

- పోలైన ఓట్ల వివరాలు అడిగితే ఈసీ నిరాకరిస్తోంది
- సీసీటీవీ ఫుటేజ్ 45 రోజులకు తొలగించడం దారుణం
- ఈసీపై ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు

**ఢిల్లీ, మహా:** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. పోలింగ్ జరిగిన 45 రోజులకు సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాటు ఉండాల్సిన పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్‌ను కేవలం 45 రోజుల తర్వాత తొలగించాలని నిర్ణయించడం దారుణమని వ్యాఖ్యానించారు. పోలైన ఓట్ల వివరాలు అడిగితే కూడా ఈసీ నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యిందని, ఈసీ తీసుకున్న తాజా నిర్ణయం ఇందుకు నిదర్శనమన్నారు. అయితే రాహుల్ గాంధీ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఓటర్ల గోప్యత, భద్రతను నిర్ధారించడం అవసరమని చెబుతూ, పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజ్‌లను 45 రోజుల్లోపు నాశనం చేయాలనే తన నిర్ణయాన్ని కమిషన్ సమర్థించుకుంది. శనివారం రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక పోస్ట్ ద్వారా ఎన్నికల కమిషన్ పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తారు. కమిషన్ ముఖ్యమైన ఆధారాలను దాచిపెడుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన ఆరోపించారు.

# 30లోగా అన్ని వివరాలు ఇస్తాం

## జస్టిస్ ఘోష్ కమిషన్‌కు సీఎంవో లేఖ

### క్యాబినెట్ మినిట్స్ ఇవ్వాలని సర్కార్ కు ఆదేశాలు

### గత సర్కార్ తీర్మానాలు, రికార్డులను పంపించనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి పునరాకృతి, మంత్రివర్గ ఉపసంఘం, మంత్రివర్గం నిర్ణయాల వివరాలను ఈ నెల 30లోగా అందజేస్తామని సీఎంవో జస్టిస్ ఘోష్ కమిషన్‌కు లేఖ రాసింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావులు నిర్ణయాలన్నీ మంత్రివర్గ ఆమోదంతో తీసుకొన్నట్లు కమిషన్ ఎదుట చెప్పడంతో, వాటిని నిర్ధారించుకునేందుకు కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు జారీచేసిన సమయానికి మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అన్న వివరాలను నీటిపారుదల శాఖ నుంచి తీసుకుంటున్నారు.

**ఇటీవల ప్రభుత్వానికి లేఖ..**

కాళేశ్వరంపై కేబినెట్ తీర్మానాలపై కమిషన్ ఆరా తీస్తోంది. ఈ మేరకు పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. కాళేశ్వరంపై మంత్రివర్గ తీర్మానాలను ఇవ్వాలని కోరింది. కేబినెట్ తీర్మానాల మేరకే నిర్ణయాలు జరిగాయని కమిషన్ విచారణలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, నాటి మంత్రి, ప్రస్తుత ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. ఈ నేపథ్యంలో కేబినెట్ తీర్మానాల వివరాలు ఇవ్వాలని కమిషన్ కోరింది. అయితే కాళేశ్వరంకు కేబినెట్ ఆమోదం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో గత ప్రభుత్వ కేబినెట్ తీర్మానాల రికార్డులను ప్రభుత్వం కమిషన్‌కు పంపించనుంది.

**ఉపసంఘం నియామకం..**

ప్రాణహితచేవెళ్లలో భాగంగా ఎల్లంపల్లి నుంచి నీటిని మళ్లించే పనులకు టెండరు పిలవగా, పునరాకృతి తర్వాత కాలువల సామర్థ్యం పెరగడంతో పనులను గుత్తేదారులకు ఎలా అప్పగించాలన్న దానిపై ముగ్గురు మంత్రులతో ఉపసంఘాన్ని అప్పటి ప్రభుత్వం నియమించింది. ఉప సంఘం ప్యాకేజీల వారీగా వివరాలు సేకరించారు. మొదట చేపట్టిన పనితో కలిసిపోయి ఉండి విడతీయడానికి వీలుకాకపోతే అప్పటికే ఉన్న గుత్తేదారుకు ఇవ్వాలని సూచించింది. ప్రత్యేకంగా టెండర్ పిలవడానికి అవకాశం ఉన్నవాటికి టెండరు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ప్రతి ప్యాకేజీలో ఈ వివరాలు స్పష్టంగా పేర్కొంటూ నివేదిక ఇచ్చింది. ట్రాన్స్‌పరెన్సీ ప్రైస్ డిస్కవరీ, స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో టెండర్ ప్రక్రియకు సిఫార్సు చేసినట్లు తెలిసింది.

# మంత్రిగా అడ్లూరి బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, మహా:** ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడ్లూరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తోపాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆయా వర్గాల సంక్షేమానికి సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేశారు. దివ్యాంగుల స్వయం ఉపాధి యూనిట్లకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదలకు ఆమోదం తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500కి పెంచారు. గిరిజన విద్యా సంస్థల మరమ్మతులకు రూ.79.61కోట్లు, గిరిజన మినీ గురుకులాల నిర్వహణకు రూ.17.18 కోట్లు, మేడారం జాతర మిగిలిన పనులకు రూ.44.5కోట్లు మంజూరు చేశారు.

# 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్, మహా :** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఒక కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 27వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఖరీఫ్ సీజన్ అవసరాల నిమిత్తం నీటి విడుదలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇరు రాష్ట్రాల వాటాలు, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు పోను సాగునీటికి ఎంత కేటాయించాలనే అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చించనున్నారు. ఈ మేరకు కేఆర్ఎంబీ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చింది. రెండు రాష్ట్రాల అధికారులు తమ తమ రాష్ట్రాల అవసరాలు, డిమాండ్లను ఈ సమావేశంలో బోర్డు ముందు ఉంచనున్నాయి.

# బనకచర్ల ప్రాజెక్టును ఆపాల్సిందే..

- రాష్ట్రంలో మార్పు తేవాలనే ప్రయత్నంలో కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చాము
- గత ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేసి అరెస్టు లు చేసేది
- కాలేశ్వరం కట్టి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశాడు
- రంగారెడ్డి జిల్లా తెలంగాణ జన సమితి ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం

**ఎల్బీనగర్, మహా:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఏపి ప్రభుత్వానికి మంచి సంబంధాలు ఉండడంతో బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదని , ఆ ప్రాజెక్టును వెంటనే ఆపాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసమితి ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని రంగాల ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని, ప్రజలు మార్పు కోరుకున్నారని ఆ మార్పు కోసమే తెలంగాణ జన సమితి పార్టీ కాంగ్రెస్ కు గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చి కాంగ్రెస్ గెలుపులో ముఖ్య భూమిక పోషించామని ఆయన అన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలపై ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్న మాకన్నా ముందే పోలీసులకు తెలిసేదని ఫోన్ టాపింగ్ వల్లనే ఆ సమాచారం వాళ్లకు ముందే తెలిసిందని అన్నారు.కొలువుల కొట్లాట, కృష్ణ జలాలపై పోరాటాలపై తెలంగాణ జన సమితి తెలంగాణ ప్రజల గొంతుకగ పనిచేసిందని గుర్తు చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వంలో సమావేశాలు ధర్నాలు ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నామని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి, మంత్రులు,అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పనులు చేస్తున్నారని అన్నారు.కేసిఆర్ పాలనలో నాలుగు లక్షల ఇరవై వేల ఎకరాల భూసేకరణ జరిగిందని, అందులో 44 వేల ఎకరాలు పేద రైతులకు ఇచ్చినవే అని అన్నారు.ఫార్మా సిటీలో 2300 ఎకరాల భూమిని సేకరణ నుండి మినహాయించాలని ప్రభుత్వానికి విన్నవించారు.రైతు భరోసా, లోన్లు కూడా ఆ భూములకు ఇవ్వాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుందని అన్నారు.భూ సేకరణ విషయంలో విధివిధానాలు కచ్చితంగా ఉండాలని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి తెలంగాణను అప్పుల పాలు చేశారని తెలిపారు.జాబ్ క్యాలెండర్,నోటిఫికేషన్ లు కూడా రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు చుట్టే తిరుగుతున్నాయని, అలా కాకుండా రాజకీయాలు ప్రజల చుట్టే తిరగాలని అన్నారు. అందరికీ ప్రభుత్వ పనిలో వాటా దొరకాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.రాష్ట్ర కమిటీ సభ్యులుగా కేవీ రంగారెడ్డిని తీసుకున్నట్లు తెలిపారు.అనంతరం రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు.రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా దార సత్యం ,ప్రధాన కార్యదర్శిగా కొత్త రవి,ఉపాధ్యక్షులుగా ఆర్ కే నాగని, షేక్ ఇమామ్ హుస్సేన్,పగడాల రమణ, జాయింట్ సెక్రెటరీలుగా నిరంజన్, ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జంగయ్య,లింగయ్య ,రమేష్ యాదవ్, పెంటా రెడ్డిలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు ధర్మార్జున్, బైరి రమేష్, ఆశప్ప, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి హనుమంత రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య ,మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, జనగాం జిల్లా అధ్యక్షుడు అశోక్ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలుగు

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# రప్పా రప్పా రాజకీయ ట్రెండ్

**తెలంగాణ ఆంధ్రాలో రప్పారప్పా రాజకీయాల ట్రెండ్ మొదలైంది. హరీష్ రావు పర్యటనలో 2028లో రప్పారప్పా 3.0 పేరుతో ప్లకార్డులు ప్రదర్శించడం గులాబీపార్టీలో చర్చనీయాంశంగా మారింది. హరీష్ ను బిఆర్ఎస్ క్యాడర్ సీఎంగా చూడాలనుకుంటున్నారా? తాజా నినాదం వెనుక వ్యూహంపై చర్చ జరగుతోంది. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని ప్రకటించిన కవిత తన కార్యక్రమాలు, నిర్ణయాలలో కన్ఫ్యూజన్ తో క్యాడర్ ను కూడా గందరగోళంలో పడేస్తున్నది. బనకచర్ల వివాదాన్ని లేవనెత్తిన బిఆర్ఎస్ ఇందుకు బీజం వేసింది కేసీఆరే అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎదురుదాడికి దిగడంతో ఆత్మరక్షణలో పడింది. లోకేష్ పై యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రశంసలు భవిష్యత్తుకు సంకేతంగా నిలుస్తున్నాయి.**

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో "రప్పారప్పా" ట్రెండ్ మొదలైంది. నిన్న టిదాకా తగ్గేదెలే అని, రెడ్ బుక్ అని, పింక్ బుక్ అని, ఆరెంజ్ బుక్ అని క్యాడర్ ను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన నేతలు ఇపుడు రప్పారప్పా ప్లకార్డులు, బ్యానర్లతో ఉద్రిక్తతలు క్రియేట్ చేస్తున్నారు. క్యాడర్ ఉత్సాహపడేందుకు, క్యాడర్ ను ఉత్సాహపరిచేందుకు ఇలాంటివి ప్రోత్సహిస్తున్నా ఉద్రిక్తతలు పెరిగితే ఇబ్బందులు పడేది కూడా కార్యకర్తలే. ఉమ్మడి మెదక్ లో హరీష్ ఫొటోతో.. రప్పారప్పా 3.0 వస్తున్నాం అంటూ ప్రదర్శించిన ప్లకార్డులు బిఆర్ఎస్ లో చర్చనీయాంశంగా మారాయి. రప్పారప్పా 3.0లో హరీష్ రావు పార్టీని రీబ్రాండ్ చేసే ప్రయత్నం కనబడుతోంది. బిఆర్ఎస్ క్యాడర్‌లో హరీష్ రావును ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూడాలనే ఆకాంక్షలు గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నాయి. ఆయన సమర్థవంతమైన పరిపాలన, బాష, క్షేత్ర స్థాయి నాయకత్వం క్యాడర్‌ను ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాలలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారత రాష్ట్ర సమితి ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగుతోంది. అయితే ఇపుడు రప్పారప్పా ట్రెండ్.. తెలుగు పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. రప్పారప్పా అనేది పుష్ప 2 సినిమాలో అల్లు అర్జున్ డైలాగ్. రప్పారప్పా పేరుతో ఎఎన్ఎన్ ఛానల్ లో కూడా నర్సయ్య తాత తగ్గేదెలే షో గత ఆరుమాసాలుగా ప్రసారమవుతోంది. ఇది ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇపుడు అల్లు అర్జున్ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గద్దర్ అవార్డుల వేడుకలో మరోసారి ఈ డైలాగ్ చెప్పడంతో ఒక్కసారి ట్రెండీగా మారింది. ఆ వెంటనే పల్నాడు జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తలు జగన్ ఫొటోతో రప్పారప్పా ప్లకార్డులు ప్రదర్శించడంతో ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇపుడు ఆ ట్రెండ్ తెలంగాణకు కూడా పాకింది. పదేళ్ళు అవినీతి పాలన చేసి.. ఇపుడు రప్పా.. రప్పా అంటే మీ అవినీతిని బయటపెట్టడంలో మేం కూడా రప్పారప్పా తగ్గేదెలే అంటామంటూ కాంగ్రెస్ నేతలు కౌంటరిస్తున్నారు. ఈ కౌంటర్లు ఎన్ కౌంటర్ల రాజకీయంతో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నది అందరికీ తెలిసిందే. రాజకీయ వినోదం తప్ప.

> రప్పారప్పా 3.0లో హరీష్ రావు పార్టీని రీబ్రాండ్ చేసే ప్రయత్నం కనబడుతోంది. బిఆర్ఎస్ క్యాడర్‌లో హరీష్ రావును ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూడాలనే ఆకాంక్షలు గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నాయి. ఆయన సమర్థవంతమైన పరిపాలన, బాష, క్షేత్రస్థాయి నాయకత్వం క్యాడర్‌ను ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాలలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారత రాష్ట్ర సమితి ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగుతోంది.



> రప్పారప్పా అనేది పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్ డైలాగ్. రప్పారప్పా పేరుతో ఎఎన్ఎన్ ఛానల్ లో కూడా నర్సయ్య తాత తగ్గేదెలే షో గత ఆరుమాసాలుగా ప్రసారమవుతోంది. ఇది ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇపుడు అల్లు అర్జున్ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గద్దర్ అవార్డుల వేడుకలో మరోసారి ఈ డైలాగ్ చెప్పడంతో ఒక్కసారి ట్రెండీగా మారింది. ఆ వెంటనే పల్నాడు జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తలు జగన్ ఫొటోతో రప్పారప్పా ప్లకార్డులు ప్రదర్శించడంతో ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇపుడు ఆ ట్రెండ్ తెలంగాణకు కూడా పాకింది.

> జూన్ నెల గులాబీపార్టీకి పరేషాన్ మిగిల్చింది. ఏపీతో పోలిస్తే చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిధానంగా ఆత్మరక్షణ ధోరణిలో ఉందన్న అభిప్రాయం అధికారపార్టీ క్యాడర్ లో ఉంది. అయితే ఏపీలో కూటమి ప్రభుత్వం ఉండడం, పైన కూటమిపై ఆధారపడ్డ కేంద్ర ప్రభుత్వం ఉండడంతో టిడిపి ఆడింది ఆటగా ఉంది. తెలంగాణ లో ఇందుకు కొంత భిన్నమైన పరిస్థితి ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు కనబడుతోంది.

> ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇపుడు రప్పారప్పా విచారణ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకంగా 650మందికి పైగా ఫోన్లను గత ప్రభుత్వం ట్యాప్ చేసిందని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఇటీవల తెలిపారు. కేంద్రమంత్రి బండిసంజయ్ ను కూడా సాక్షిగా వాంగ్మూలం ఇవ్వమని సిట్ అధికారులు కోరారు. రాజకీయ విశ్లేషకులు గోనె ప్రకాష్ రావుతో పాటు పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సైదులు లాంటి వారి ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని విచారణకు పిలిచారు.

క్యాడర్ ఆకాంక్షలు ఒక వైపు ఉన్నా హరీష్ రావు సీఎం అభ్యర్థిగా ఎదగడం బిఆర్ఎస్ రాజకీయ వ్యూహంలో సాధ్యపడే పని కాదన్నది తాజా అంచనా. హరీష్ రావు తనను తాను "టీమ్ ప్లేయర్"గా చూపించుకోవడం ద్వారా పార్టీ ఐక్యతను కాపాడే ప్రయత్నంలో ఉన్నారు. బిఆర్ఎస్ లో కేసీఆర్ నాయకత్వం ఇప్పటికీ బలంగా ఉంది. కేసీఆర్ కుటుంబ ఆధిపత్యం కారణంగా హరీష్ రావును సీఎం అభ్యర్థిగా ప్రకటించే అవకాశం తక్కువ. కేటీఆర్ కేసీఆర్ వారసుడిగా కీలక పాత్రలు పోషిస్తుండగా, హరీష్‌కు సీఎం అవకాశం కల్పించడం కుటుంబ రాజకీయాలకు విరుద్ధం. టీమ్ ను ఐక్యంగా ఉంచడం కోసమే హరీష్ రావు కేటీఆర్ నాయకత్వాన్ని కూడా అంగీకరిస్తానని, కేసీఆర్ ఏం చెప్పినా తాను జవదాటనని విస్పష్టంగా తరచూ చెబుతున్నారు. అయితే బిఆర్ ఎస్ ముందు అనేక సవాళ్ళున్నాయి.

జూన్ నెల గులాబీపార్టీకి పరేషాన్ మిగిల్చింది. ఒకే నెలలో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు కీలక నేత హరీష్ రావు కూడా విచారణలను ఎదుర్కొన్నారు. కాళేశ్వరం స్కామ్ లో ఈఎన్ సిలు, సిఈ ల వద్ద గుట్టలుగా దొరికిన డబ్బు ప్రాజెక్టు అనేకమందికి పాలిచ్చే ఆవుగా ఎలా మారిందో చెబుతోంది. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో అనుమతులు లేకుండా డబ్బు చేతులుమారడం నేరంగా పరిగణిస్తున్నారు. ఏపీతో పోలిస్తే చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిధానంగా ఆత్మరక్షణ ధోరణిలో ఉందన్న అభిప్రాయం క్యాడర్ లో ఉంది. అయితే ఏపీలో కూటమి ప్రభుత్వం ఉండడం, పైన కూటమిపై ఆధారపడ్డ కేంద్ర ప్రభుత్వం ఉండడంతో టిడిపి ఆడింది ఆటగా ఉంది. తెలంగాణ లో ఇందుకు కొంత భిన్నమైన పరిస్థితి ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు కనబడుతోంది. మంచైతే కల్వకుంట్ల ఘనత.. చెడైతే ఇంజినీర్ల బాధ్యత అన్నట్లుగా కాళేశ్వరంపై బిఆర్ఎస్ స్పందన ఉందని రాజకీయవర్గాలు అంటున్న మాట.

భద్రాచలం డివిజన్ పోలవరం ముంపు జరుగుతుందంటూ ఏడు మండలాలను ఏపీ లో కలపగా, దీనిని తెలంగాణ ఆవిర్భావ సమయంలో అందరూ వ్యతిరేకించారు. తొలి టర్మ్ లో అడపాదడపా దీనిపై మాట్లాడిన పెద్దలు.. తర్వాత అది ఒడిసిన ముచ్చటగా డిక్లేర్ చేశారు. కవిత గత ఐదేళ్ళలో ఎన్నడూ వీటిపై ఆందోళనలు చేయలేదు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించలేదు. అధికారం పోగానే కల్వకుంట్ల కుటుంబం తాము అధికారంలో ఉన్నపుడు.. ఏం చెప్పామో ఏం చేశామో అన్నీ మరిచిపోయి.. పాత పల్లవి అందుకోవడం ప్రజల జ్ఞాపకశక్తి మీద వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనమన్న వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. ఎవరేమనుకున్నా దూకుడుగా ముందుకెళ్ళడం కవిత శైలి. కానీ ఆ కార్యక్రమాలు కనీసం తనకన్నా మేలు చేసేలా రూపకల్పన చేసుకోవాలని, ఏదో ఒకటి చేసేయాలన్న ఆత్రుత, అర్జంట్ గా ఏదో ఒకటి కావాలన్నతపన.. కఠిన నిర్ణయాలు తీసుకోలేని బలహీనత కలగలిసి కవిత అంటే కన్ ఫ్యూజన్ అన్న చందంగా మారారన్న విమర్శలు వ్యాఖ్యానాలు గులాబీపార్టీ నుండే వినబడుతున్నాయి. తాను దెయ్యాలు అంటూ ప్రకటించి, మళ్ళీ వారితోనే కలగలిసి, ఒకరోజు కలివిడిగా, మరోరోజు విడివిడిగా ఉన్నట్లు.. లేనట్లు చేస్తున్న కార్యక్రమాలు చివరకు కవితకు కూడా ఉపయోగపడడం లేదన్న చర్చలు జరుగుతున్నాయి. కవిత రాజకీయ వ్యాఖ్యలు, భావోద్వేగ పోస్ట్ లు, క్యాడర్‌లో గందరగోళాన్ని కలిగిస్తున్నాయి. బిఆర్ఎస్ పోరాటంలో వెనుకపడి ఉంది కాబట్టే... తమ జాగ్రుతి ద్వారా కార్యక్రమాలు చేపట్టినట్లు కవిత పలుమార్లు చెప్పారు. ఓవైపు ప్రభుత్వంపై పోరాడుతున్న బిఆర్ఎస్ కు కవిత ఎపిసోడ్ ఇబ్బందిపెట్టే పరిణామమే. పార్టీనే సవాల్ చేస్తున్న కవిత ఎంతకాలం ఒంటరి కార్యక్రమాలు చేస్తారో చూడాల్సి ఉంది. బిఆర్ఎస్ ఈ సమస్యను పరిష్కరించుకోకుంటే.. నష్టం స్పష్టం.

> కవిత అంటే కన్ ఫ్యూజన్ అన్న చందంగా మారారన్న విమర్శలు వ్యాఖ్యానాలు గులాబీపార్టీ నుండే వినబడుతున్నాయి. తాను దెయ్యాలు అంటూ ప్రకటించి, మళ్ళీ వారితోనే కలగలిసి, ఒకరోజు కలివిడిగా, మరోరోజు విడివిడిగా ఉన్నట్లు.. లేనట్లు చేస్తున్న కార్యక్రమాలు చివరకు కవితకు కూడా ఉపయోగపడడం లేదన్న చర్చలు జరుగుతున్నాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇపుడు రప్పారప్పా విచారణ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకంగా 650మందికి పైగా ఫోన్లను గత ప్రభుత్వం ట్యాప్ చేసిందని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఇటీవల తెలిపారు. కేంద్రమంత్రి బండిసంజయ్ ను కూడా సాక్షిగా వాంగ్మూలం ఇవ్వమని సిట్ అధికారులు కోరారు. రాజకీయ విశ్లేషకులు గోనె ప్రకాష్ రావుతో పాటు పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సైదులు లాంటి వారి ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని విచారణకు పిలిచారు. వ్యక్తిగత ఫోన్లను ట్యాప్ చేసిన ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉండి, ఇపుడు తన దాకా వచ్చేరికి వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది కలిగించకూడదని, ఫోన్లు అడగడం హక్కుల ఉల్లంఘనే అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. కేటీఆర్ వాదనలు రాజకీయంగా బలంగా ఉన్నా, ఫోన్ ట్యాపింగ్ వివాదం బిఆర్ఎస్ ఇమేజ్‌కు దెబ్బ తీసింది. చట్టపరమైన విచారణలు కొనసాగుతున్నందున, ఈ వివాదం బిఆర్ఎస్ దీర్ఘకాలిక రాజకీయ సవాళ్లను తెచ్చిపెడుతుంది. కేటీఆర్ సమర్థనలో స్పష్టత లేకపోవడం ప్రతికూల అంశం. భార్యభర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగసభల్లో చేస్తున్న విమర్శలు బిఆర్ఎస్ కు నష్టం కలిగిస్తున్నాయి. ఇక బనకచర్ల కు బీజం పడింది కేసీఆర్ హయాంలోనేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. కేసీఆర్ జగన్ కలయిక, రాయలసీమ కు గోదావరి జలాలు ఇస్తానన్న కేసీఆర్ మాటలు ప్రజలకు గుర్తున్నాయి. అందుకే బనకచర్ల వ్యవహారంలో ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టాలన్న బిఆర్ఎస్ ప్రయత్నాలకు మద్దతు రావడం లేదు.

విశాఖ యోగా డే గిన్నిస్ రికార్డులకెక్కగా, నెలరోజులుగా దీని విజయవంతానికి మంత్రి నారా లోకేష్ పడ్డ శ్రమను ప్రధాని మోదీ గుర్తించారు. ప్రశంసించారు. దేశంలోని యువ నాయకులకు లోకేష్ స్ఫూర్తి అని, కష్టపడే నాయకుడు లోకేష్ అంటూ ఆకాశానికెత్తారు. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారంలో ఉంది. చంద్రబాబు వయసు రీత్యా టిడిపికి లోకేషే భవిష్యత్తుగా ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు యువగళం ద్వారా, ఇతర కార్యక్రమాల ద్వారా లోకేష్ రాటుదేలారు. క్యాడర్ లో ఉత్సాహం నింపి నిరూపించుకున్నారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో లోకేష్ వ్యవహరించిన తీరు, పరిణతి మోదీతో పాటు జాతీయ నాయకులను ఆకట్టుకుంది. పొత్తుల్లో అది కూడా ఓ టర్నింగ్ పాయింట్ ఉంది. అధికారంలోకి వచ్చాక టిడిపి క్యాడర్ ఆకాంక్షలు నెరవేరుస్తున్న నాయకుడిగా అభిమానం సంపాదించుకున్నారు. విమర్శల్లోంచి.. తనను తాను మలుచుకుని స్ఫూర్తివంతంగా ఎదిగిన నాయకుడిగా లోకేష్ నిలిచారు. ఇపుడు యోగా డే సందర్భంగా ప్రధాని మోదీ లోకేష్ చురుకుదనం, నాయకత్వ పటిమ చూసి ముచ్చటపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చంద్రబాబు ముద్రే కాదు.. లోకేష్ ముద్రను కూడా మోదీ గుర్తించారు. లోకేష్‌ను యువ నాయకుడిగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా, వైఎస్సార్ సీపీ నాయకత్వంపై ఒత్తిడి పెంచడం కూడా మోదీ లక్ష్యం. ఇది 2029 ఎన్నికల దృష్ట్యా రాజకీయ వ్యూహంగా చూడవచ్చు. మోదీ ప్రశంసలు లోకేష్ రాజకీయ ఇమేజ్‌ను బలోపేతం చేస్తాయి.

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

> పోలవరం ముంపు జరుగుతుందంటూ భద్రాచలం డివిజన్ లోని ఏడు మండలాలను విభజన సమయంలో ఏపీ లో కలపగా, దీనిని తెలంగాణ ఆవిర్భావ సమయంలో అందరూ వ్యతిరేకించారు. తొలి టర్మ్ లో అడపాదడపా దీనిపై మాట్లాడిన పెద్దలు.. తర్వాత అది ఒడిసిన ముచ్చటగా డిక్లేర్ చేశారు. కవిత గత ఐదేళ్ళలో ఎన్నడూ వీటిపై ఆందోళనలు చేయలేదు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రశ్నించలేదు. అధికారం పోగానే కల్వకుంట్ల కుటుంబం తాము అధికారంలో ఉన్నపుడు.. ఏం చెప్పామో ఏం చేశామో అన్నీ మరిచిపోయి.. పాత పల్లవి అందుకోవడం ప్రజల జ్ఞాపకశక్తి మీద వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనమన్న వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి.

> విశాఖ యోగా డే గిన్నిస్ రికార్డులకెక్కగా, నెలరోజులుగా దీని విజయవంతానికి మంత్రి నారా లోకేష్ పడ్డ శ్రమను ప్రధాని మోదీ గుర్తించారు. ప్రశంసించారు. దేశంలోని యువ నాయకులకు లోకేష్ స్ఫూర్తి అని, కష్టపడే నాయకుడు లోకేష్ అంటూ ఆకాశానికెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు యువగళం ద్వారా, ఇతర కార్యక్రమాల ద్వారా లోకేష్ రాటుదేలారు. క్యాడర్ లో ఉత్సాహం నింపి నిరూపించుకున్నారు.

> చంద్రబాబు అరెస్ట్ సమయంలో లోకేష్ వ్యవహరించిన తీరు, పరిణతి మోదీతో పాటు జాతీయ నాయకులను ఆకట్టుకుంది. అధికారంలోకి వచ్చాక టిడిపి క్యాడర్ ఆకాంక్షలు నెరవేరుస్తున్న నాయకుడిగా అభిమానం సంపాదించుకున్నారు. విమర్శల్లోంచి.. తనను తాను మలుచుకుని స్ఫూర్తివంతంగా ఎదిగిన నాయకుడిగా లోకేష్ నిలిచారు. లోకేష్‌ను యువ నాయకుడిగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా, వైఎస్సార్ సీపీ నాయకత్వంపై ఒత్తిడి పెంచడం కూడా మోదీ లక్ష్యంగా కనబడుతోంది. మోదీ ప్రశంసలు లోకేష్ రాజకీయ ఇమేజ్‌ను బలోపేతం చేస్తాయి.

# మాదక ద్రవ్యాల నిరోధానికి చర్యలు

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మహా**

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వారం రోజుల పాటు మాదక ద్రవ్యాల నిరోధక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దాదాపు మూడు వందల మంది పోలీసు సిబ్బందితో కలిసి యోగా చేశారు. అనంతరం యోగా ప్రాధాన్యత గురించి వివరించారు. యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధక వారోత్సవాలను జరపనున్నామని, ఇందులో యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్ రెడ్డి, నాగేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది భారతదేశమేనని అన్నారు. యువత చెడు మార్గాల వైపు పయనించకుండా యోగా, క్రీడలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగానే యాంటి డ్రగ్ వీక్ ను జరపనున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సరైన అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

# యోగాతో ఆరోగ్యకరమైన జీవితం

## ఎంపీ గోడం నగేష్

**అదిలాబాద్, మహా:** భారత దేశంలో పుట్టిన యోగాను ప్రస్తుతం ప్రపంచమంతా సాధన చేస్తోందని, నిత్య జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకర జీవనం గడపాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. యోగా గురువులు పలు ఆసనాలు వేయించగా... అధికారులు, ప్రజా ప్రతినిధులు యోగా సాధన చేశారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యోగాసనాలు చేసే విధానం, వాటి ఉపయోగాలు తదితర




అంశాలను గురువులు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో మేలు చేస్తుందన్నారు. ప్రతి రోజు అరగంట యోగాకు సమయం కేటాయించడం ద్వార ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చినుకు లేక చింత..

- జిల్లాలో ఐదు రోజులుగా జాడలేని వర్షం
- భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తని వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



**ఆదిలాబాద్, మహా** ఆదిలాబాద్ జిల్లాలో చినుక జాడ లేకుండా పోయింది. గత ఐదు రోజుల నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు హైరానాకు గురవుతున్నారు. ఇప్పటికే విత్తనాలు వేయడంతో అవి మొలకెత్తడంపై ఆందోళణ నెలకొంది. విత్తనం వేసిన రోజు నుంచి వర్షం రాకపోవడంతో భూమిలోనే మురిగిపోయే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు లోటు వర్షపాతం నమోదవుతోంది.ఇప్పటి వరకు 7.8మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా..కేవలం 0.4మి.మి వర్షపాతం మాత్రమే కురిసింది. దీంతో పంటలకే కాకుండా భూగర్భజలాలు సైతం పెరగని పరిస్థితి కనిపిస్తోంది.

**అన్నదాతల్లో ఆందోళన**

జిల్లాలో నైరుతి రుతు పవనాలు ముందుగానే వచ్చాయని అందరూ ఆనందం వ్యక్తం చేశారు. కిందటి నెలాఖరులో జిల్లాలో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. అనంతరం ఆగిపోయాయి. తాజాగా ఐదు రోజుల క్రితం మళ్లీ ఒకటి, రెండు రోజులు వరుసగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులంతా విత్తనాలు వేశారు. వర్షాలు వరుసగా వస్తే మొలకెత్తి పంట ఏపుగా పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని భావించి ముందస్తుగానే విత్తనాలు విత్తుకున్నారు. పెద్ద రైతులతో పాటు చిన్న సన్నకారు రైతులు సైతం విత్తనాలు వేశారు. తీరా గత ఐదు రోజుల నుంచి చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భూమిలో వేసిన విత్తనాలు అనేకం ఇప్పటికే పనికిరాకుండా పోయాయి. ఒకటి, రెండు రోజుల్లో వర్షం రాకపోతే మిగిలినవి సైతం భూమిలో కలిసిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ కొద్దిపాటి జల్లులు కురుస్తున్నా అంతగా ఉపయోగం ఉండటం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో ఇప్పటికే ఒక్కో రైతు విత్తనాల కోసం ఖర్చు చేసిన రూ.లక్షలాది రూపాయిలు భూమిలో పోసినట్లయిందని అన్నదాతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

**మెజార్టీ మండలాల్లో వర్షా భావం...**

ఆదిలాబాద్ జిల్లాలో 21 మండలాలు ఉండగా ఒకటి, రెండు మినహా దాదాపు మెజార్టీ మండలాల్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. జిల్లాలో ఇప్పటి వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువగా నమోదు కావడం చూస్తుంటేనే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. బోథ్ మండలంలో 4.0మి.మి, నార్నూర్లో 2.6మి.మి, ఇంద్రవెల్లిలో 1.8మి.మి, బజార్హత్నూర్లో 1.0మి.మి, బేలలో 1.0 మినహా మిగితా అన్ని మండలాల్లో అతి తక్కువగా వర్షపాతం నమోదు కావడం దుర్భిక్ష పరిస్థితులకు అద్ధం పడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా కేవలం పంటలకే కాకుండా భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు, చేతిపంపులు ఇంకా పనిచేయలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే మరింత గడ్డు పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### వర్షం లేక పత్తి మొలకెత్తలేదు

ఐదు రోజుల క్రితం వరుసగా వర్షా లు కురవడంతో మూడు ఏకరాల్లో ఆరు బ్యాగుల పత్తి విత్తనాలు వేశాను. విత్తనం విత్తిన నాటి నుంచి వర్షం లేకపోవడంతో మొలకెత్తలేదు. ఇప్పటికే చాలా వరకు విత్తనాలు పనికిరాకుండా పోయాయి. ఒకటి, రెండు రోజుల్లో వర్షం రాకుంటే మిగితా విత్తనాలు కూడా మొలకెత్తకుండా పోతాయి.

- బొజ్జ పేటన్న, రైతు, జందాపూర్




# లే అవుట్ గా నమ్మించి.. ప్లాట్లుగా విక్రయించి..

## భూ వ్యవహారంలో ఆదినాథ్ అరెస్టు

**ఆదిలాబాద్, మహా:** అటవీ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించిన కేసులో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వకులా భరణం ఆదినాథ్ ను అరెస్టు చేసినట్లు డిఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఖానాపూర్ సమీపంలోని అటవీ భూమిని లే అవుట్ అని నమ్మించి నాలుగు ప్లాట్లు విక్రయించారని తెలిపారు. బాధితురాలు శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన, బీజేపీ కీలక నేత వకులాభరణం ఆదినాథ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. నిందితుడు ఆదినాథ్, ఆయన భార్య రజిని 2010లో ఖానాపూర్ లోని ఫారెస్ట్ ల్యాండ్ ను లే అవుట్ అని చెప్పి మోసపూరితంగా నాలుగు ప్లాట్లు విక్రయించారు. ఫారెస్ట్ అధికారులు సదరు భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవడంతో బాధితురాలు నిందితులను సంప్రదించగా... నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశామని, ఆయన భార్య పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులను విచారణ చేయగా అది ఫారెస్ట్ భూమి అని తేలినట్లు వివరించారు. భూ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని, ప్రజలను మోసం చేస్తూ, నకిలీ పత్రాలను సృష్టించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# స్పెషల్ జాకెట్ లో దేశిదారు సీసాలు

## పోలీసులకు పట్టుబడిన కేటుగాడు

**ఆదిలాబాద్, మహా:** మహారాష్ట్ర నుంచి మద్యం అక్రమ మార్గంలో జిల్లాకు తరలించడానికి కొత్త కొత్త మార్గాలను వెతుక్కుంటున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మద్యం సీసాలను ఓ వ్యక్తి జాకెట్లలో దాచి ఒంటిపై మరో షర్ట్ వేసుకొని రవాణా చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.ఆదిలాబాద్ జిల్లాలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో గత వారం రోజుల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. భోరజ్ మండలం పెండల్వాడకు చెందిన అశోక్, ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరికి చెందిన కాకెర్ల అరుణ్,తాంసి మండలం లీంగూడకు చెందిన టేకం రజిత అక్రమంగా దేశీదారు అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. మద్యం



విలువ సుమారు రూ.5వేలు ఉంటుందని సీఐ వెల్లడించారు.మద్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ స్కూల్స్ లో ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణి

- స్పందించని మండల విద్యా శాఖా అధికారులు
- వెంటనే స్పదించి విద్యార్థులకు తగు న్యాయం చేయాలనీ డిమాండ్
- ఎస్ఎఫ్ఐ రంగా రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్

**షాద్ నగర్, మహా:** ఒక పక్క ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజుల దోపిడీ.. మరో పక్క ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మూత్రశాలలు కడిగిపిస్తున్నారు విద్యార్థులకు చదువు అధించాల్సిన ఉపాధ్యాయులు వారి బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్న పరిస్థితిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్ నగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ కమిటీ సమావేశం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వారు పేర్కొంటూ.. నేరేళ్ళ పల్లి గ్రామంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు మూత్రశాలలు శుభ్రం చేయిస్తే, కేశంపేట మండలం పాటిగడ్డలో టీచర్లు మాత్రం మేమేం తక్కువ అని 7 మంది ఉపాధ్యాయులు తమ విధులకు సెలవు పెట్టి మరి వారి యొక్క సొంత




అవసరాలకి వెళ్లారనీ ఇలా అయితే విద్యా వ్యవస్థ ఎలా మార్పు వస్తుందని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ బడులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయనీ వీటిలో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల లేమి, నాణ్యమైన విద్యా పద్ధతుల లోపం మరియు నిధుల కొరత ప్రధానమైనవనీ చాలా ప్రభుత్వ బడుల్లో తగిన గదులు, శుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, లైబ్రరీలు మరియు ల్యాబ్ లు లేకపోవడం ఒక సాధారణ సమస్య. ఇంకా, ఉపాధ్యాయుల శిక్షణ మరియు నియామక ప్రక్రియ లో లోపాలు విద్య నాణ్యతను దెబ్బతీస్తున్నాయనీ మరో పక్క విద్యా బుద్ధులు చెప్పాల్సిన గురువువులు వారికీ సహకరించడం లేనీ ఎలా అయితే పేద విద్యార్థులు ఎలా చదువుకుంటారని అధికారులను ప్రశ్నించారు.



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ జాతిపిత

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ సాధనలో తనజీవితంనీ అంకితం చేసిన ఉద్యమ పితామహుదు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు సమావేశానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. మండల మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ"జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు చిహ్నం. ఆయన ఊహించుకున్న సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. విద్యార్థి జీవితం నుంచే ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయడం ఆయన జీవితంలోని గొప్పతనం. నేటి తరానికి జయశంకర్ ఆలోచనలు పరిచయం చేయడం మా బాధ్యత. తెలంగాణ సాధించినా విధానాన్ని ప్రజలకు పూసగొచ్చినట్టు వివరించే బాధ్యత తెలంగాణ పౌరులుగా మన నిబద్ధత. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు చేసిన పోరాటాలను మరిచిపోము. విద్యార్థుల ఆత్మహత్యల బలిదానమే నేటి తెలంగాణ రాష్ట్రం. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలన్నారు. దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ రాష్ట్రం ఉండాలన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టును ఆపాల్సిందే...

## రాష్ట్రంలో మార్పు తేవాలనే ప్రయత్నంలో కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చాము

గత ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేసి అరెస్టు లు చేసేది

కాలేశ్వరం కట్టి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశాడు

రంగారెడ్డి జిల్లా తెలంగాణ జన సమితి ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం

**ఎల్బీనగర్,మహా:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఏపి ప్రభుత్వానికి మంచి సంబంధాలు ఉండడంతో బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదని , ఆ ప్రాజెక్టును వెంటనే ఆపాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లోని భాగ్య నగర్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసమితి ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని రంగాల ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని, ప్రజలు మార్పు కోరుకున్నారని ఆ మార్పు కోసమే తెలంగాణ జన సమితి పార్టీ కాంగ్రెస్ కు గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చి కాంగ్రెస్ గెలుపులో ముఖ్య భూమిక పోషించామని ఆయన అన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యల పై ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్న మాకన్నా ముందే పోలీసులకు తెలిసేదని ఫోన్ టాపింగ్ వల్లనే ఆ సమాచారం వాళ్లకు ముందే తెలిసిందని అన్నారు.కొలువుల కొట్లాట, కృష్ణ జలాలపై పోరాటాలపై తెలంగాణ జన సమితి తెలంగాణ ప్రజల గొంతుకగ పనిచేసిందిని గుర్తు చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వంలో సమావేశాలు ధర్నాలు ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నామని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి, మంత్రులు,అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పనులు చేస్తున్నారని అన్నారు.కేసిఆర్ పాలనలో నాలుగు లక్షల ఇరవై వేల ఎకరాల భూసేకరణ జరిగిందని, అందులో 44 వేల ఎకరాలు పేద రైతులకు ఇచ్చినవే అని అన్నారు.ఫార్మా సిటీలో 2300 ఎకరాల భూమిని సేకరణ నుండి మినహాయించాలని ప్రభుత్వానికి విన్నవించారు.రైతు భరోసా, లోన్లు కూడా ఆ భూములకు ఇవ్వాలని



అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుందని అన్నారు.భూ సేకరణ విషయంలో విధివిధానాలు కచ్చితంగా ఉండాలని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి తెలంగాణను అప్పుల పాలు చేశారని తెలిపారు.జాబ్ క్యాలెండర్,నోటిఫికేషన్లు కూడా రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు చుట్టే తిరుగుతున్నాయని, అలా కాకుండా రాజకీయాలు ప్రజల చుట్టే తిరగాలని అన్నారు.అందరికీ ప్రభుత్వ పనిలో వాటా దొరకాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.రాష్ట్ర కమిటీ సభ్యులుగా కేవీ రంగారెడ్డిని తీసుకున్నట్లు తెలిపారు.అనంతరం రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు.రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా దార సత్యం,ప్రధాన కార్యదర్శిగా కొత్త రవి,ఉపాధ్యక్షులుగా ఆర్ కే నాగని, షేక్ ఇమామ్ హుస్సేన్,పగడాల రమణ, జాయింట్ సెక్రెటరీలు గా నిరంజన్, ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జంగయ్య,లింగయ్య ,రమేష్ యాదవ్, పెంటా రెడ్డిలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు ధర్మార్జున్, బైరి రమేష్, ఆశప్ప, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి హనుమంత రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య ,మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, జనగాం జిల్లా అధ్యక్షుడు అశోక్ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రచారం చేద్దాం

- తెలంగాణ నదీ జలాల విషయంలో అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**మంచిర్యాల, మహా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రచారం చేస్తూనే ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర(సిపిఐ) కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం మంచిర్యాల ఎం కన్వర్షన్ హాలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుకూ, కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వం పీడిత ప్రజలు, కార్మిక వర్గం పై ఆజమాహిసి చెలాయిస్తూ, ఇష్టానుసారంగా ప్రజావ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర రేవంత్ రెడ్డి సర్కార్ కూడా ఆ ప్రజావ్యతిరేక విధానాలకు అదిగులకు మరుగులు ఒత్తుతూ వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. బిజెపి భావజాలంతో కమ్యూనిస్టులు ఉండకూడదని ఎత్తులకు పై ఎత్తులువేస్తూ ఇటీవల మావోయిస్టులను ఏరివేత పేరుతో కాల్చి చంపడం సరికాదని స్పష్టం చేశారు. మావోయిస్టులను శాంతిచర్చల



పేరిట మార్చాలి గానీ బాసిస్టు భావజాలంతో చంపడు సరికాదన్నారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక దేశంగా భారతదేశ ఎదిగినట్లు చెప్పుకుంటున్న మోడీ సర్కార్ అన్నింటా వెనుకబడి ఉందని గమనించాలని ఆకలిచావులు, వైద్య విద్య రంగంలో ఇంకా అనేక విధానాలుగా వెనుకబడటంతో పాటు అప్పులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్రం చేపట్టిన మావోయిస్టు ఏరివేతకు కేంద్రంకు రాష్ట్రం జాయింట్ ఆపరేషన్ పాల్గొనడంను సిపిఐ వ్యతిరేకిస్తుందని వివరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం బనకచర్ల వివాదం విషయంలో ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం ను ఏర్పాటు చేసి జల నిపుణుల అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. చంద్రబాబు గోదావరి నది వృధాగా కలుస్తున్న మూడువేల టిఎంసిల నీటిని వాడుకోవడానికి బనకచర్ల కడితే తప్పేందని అనడు సరికాదని ఆ నీరు తెలంగాణ ప్రాంత హక్కు అని అన్నారు. వెంటనే తెలంగాణ రైతుల దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ నిర్ణయం ను మార్చుకోవాలని సిపిఐ సూచిస్తుందన్నారు. కాళేశ్వరం నిర్మాణం ఎవరిది తప్పు అనేది త్వరలో కోర్టు నిర్ణయిస్తుందని ఇందులో ఇంజనీర్లుగా పని చేసిన ఎన్ఐ, ఇఇల వద్ద వందల కోట్లు దొరకడం అవినీతి జరిగించనడానికి నిదర్శనం అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వైఎస్ఆర్ ఉన్న సమయంలో రూపకల్పన చేసుకునే తరుణంలో ఉన్న ప్రాణహిత చేవెళ్ళ ఎత్తిపోతల పథకంను ఇప్పుడు తిరిగి నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. దీని వల్ల ఆదిలాబాద ఉమ్మడి జిల్లా రైతులకు జలవనరులు పెరగడంతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టులోని నీటిని మళ్ళించడానికి తక్కువ ఖర్చుతో పథకం పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు మేకల దాను, పట్టణ కార్యదర్శి కలీందర్ ఆలీఖాన్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి తదితరులు పాల్గొన్నారు.

# మానవ ఆనందకర జీవితానికి యోగా ముఖ్యమైనది

## మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్

- మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లోనూ ఘనంగా యోగా దినోత్సవం

**మంచిర్యాల, మహా :** మానవ ఆనందకర జీవితంలో యోగా ముఖ్య పాత్ర పోషిస్తుందని డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.హరీష్ రాజ్, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరై వ్యాయామం, యోగా చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక పరిపూర్ణత, శారీరక ఆరోగ్యం కలుగుతుందని, మానవ జీవితంలో ప్రతిరోజు యోగా, వ్యాయామానికి కొంత సమయం కేటాయించుకోవాలని తెలిపారు. యోగా ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరమని, ఒత్తిడి, ఆందోళనలతో సతమతమవుతున్న ప్రస్తుత యువత వారి దినచర్యలలో యోగా ను భాగం చేసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా సమతుల్యం సాధిస్తారని, ఎన్నో సమస్యలకు యోగ పరిష్కారం చూపుతోందని తెలిపారు. యోగాకు ఎలాంటి వివక్షత ఉండదని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంలో మనిషి మానసిక స్థితిని మెరుగుపరుచుకుని దృఢంగా




ఉండేందుకు యోగా దోహద పడుతుందని తెలిపారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా శరీరంలో, జీవనశైలిలో మార్పులు సంభవిస్తాయని, అసంక్రమణ వ్యాధుల నుండి కాపాడుకోవడంలో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. ప్రతి దినం యోగా చేయడం పిల్లలకు అలవాటు చేయాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా అధికారులు, వైద్యాధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, పిల్లలు, ఆయుష్ కార్యక్రమం ఇన్చార్జులు యోగాసనాలు సాధన చేశారు. అనంతరం యోగాలో శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, వైద్యాధికారులు డా.పద్మజ, డా.నీరజ, ఆయుష్ వైద్యులు రవికుమార్, డా.ప్రసాద్, డా.అనిత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లోనూ...**

జూన్ 21వ నాడు యోగా దినోత్సవం సందర్భంగా కోల్ బెల్ట్ ప్రాంతాల్లోనూ శనివారం ఘనంగా యోగా ప్రాధాన్యతను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. మందమర్రిలో ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ దేవేందర్, సర్కిల్ ఇన్స్ పెక్టర్ శశిధర్ రెడ్డి యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇదే వేదిక నుండి యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండ తమ భావి జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

# యోగాతో సుదీర్ఘకాలం జీవించవచ్చు

## షాద్ నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి

**షాద్ నగర్, మహా:** యోగాతో సుదీర్ఘకాలం మనిషి జీవించవచ్చని షాద్ నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ ఆఫీసులో డాక్టర్ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ బి విజయలక్ష్మి హెల్త్ స్టాప్ తో యోగా ఆసనాలు చేయించి, ప్రతి వ్యక్తి ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసికంగా శారీరకంగా ఆరోగ్యపరంగా దృఢపడుతారు అని తెలియజేశారు. ప్రతిరోజు ప్రతి మనిషి నడక నడవడం వలన, ధ్యానం చేయడం, ప్రాణాయం చేయడం, అలోమా ..విలోమా చేయడం వలన, మనిషి యొక్క ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా , జీవితం యొక్క లైఫ్ పొడిగించ బడుతుంది అనీ తెలియజేశారు. అందువలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు శారీరక యోగాసములతో పాటు ధ్యానం కూడా చేయాలని తెలియజేశారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఆరోగ్యంగా



ఉండాలంటే తప్పకుండా వాకింగ్ చేస్తూ, యోగాసనాలు చేస్తూ, ధ్యానము తప్పకుండా చేయాలని తెలియజేశారు. యోగాసనులతోపాటు ప్రతి మనిషి 45 సంవత్సరములు దాటిన తర్వాత , తను తీసుకునే ఆహారపు అలవాటులను మార్చుకోవాలని తెలియజేశారు. 45 సంవత్సరముల తర్వాత మాంసాహారం తక్కువ చేసి శాఖాహారం ఎక్కువగా తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు బాగా తీసుకోవాలని జె.శ్రీనివాసులు చెప్పారు. శాకాహారము తీసుకుంటూ , జీవన శైలిని మార్చుకున్నట్లయితే ప్రతి మనిషి ఎక్కువ కాలం జీవించవచ్చని తెలియజేశారు.

# మీరు జాతిపితా అంటే మిమ్మల్ని ప్రజలు ఉరితీసే రోజు వస్తుంది..!

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంచలన వ్యాఖ్యలు

**షాద్ నగర్, మహా:** దేశ స్వాతంత్రం కోసం అహర్నిశలు పోరాడిన గాంధీజీ జాతిపిత అయ్యారని ఆయన తర్వాత తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్, దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీలు మన జాతిపితలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. తెలంగాణ జాతిపిత మరెవరు కాలేరని అలా ఎవరైనా చెప్పుకొని తిరిగితే ప్రజలు ఉరితీసే రోజు వస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న జయశంకర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా నివాళులు అర్పించారు. షాద్ నగర్ జేఏసీ నేత జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, జేఏసీ నాయకులు, స్థానిక జర్నలిస్టులు ఉద్యోగస్తులు తదితరులు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక ఉద్యమకారులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని అన్నారు. తెలంగాణ ప్రజల కోరికను మన్నించి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని అప్పటి బిజెపి నాయకురాలు సుష్మా స్వరాజ్ మద్దతు తెలిపారని ఎన్నో ఆశలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన, దౌర్జన్యం, అక్రమాలు, అన్యాయాలు జరిగాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారన్నారు. కలలుగన్న తెలంగాణను కెసిఆర్ తన కుటుంబమయం చేసి జాతిపితగా చరిత్రకి ఎక్కాలని చూస్తే ప్రజలు సహించారని ఏదో ఒక రోజు అమరవీరుల స్తూపం సాక్షిగా ఉరి తీసే రోజు వస్తుందని ఘాటుగా స్పందించారు. జనం దృష్టిలో తెలంగాణ జాతిపితలు ఇద్దరే ఇద్దరని కొండ బాపూజీ లక్ష్మణ్, అదేవిధంగా సిద్ధాంతకర్త జయశంకర్ అని పేర్కొన్నారు. ఉద్యమకారులు చూపిన ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.





# ఓకే కుటుంబానికి చెందిన ఇద్దరు మైనర్ యువతులు మృతి

**బాలాపూర్ మహా:** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన ఓకే కుటుంబానికి చెందిన ఇద్దరు మైనర్ యువతులు ఉరివేసుకొని ఆత్మహత్య.ఉదయగిరి గ్రామం నెల్లూరు జిల్లాకు చెందిన కుటుంబ గత నేల క్రితం బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ రావడం జరిగింది. వినీల వయసు 17 సంవత్సరాలు అఖిల వయసు 16 సంవత్సరాలు పెద్ద అమ్మాయి గత మూడు నెలల క్రితం యువకుడుని ప్రేమించి ఇంట్లో నుండి పారిపోవడం జరిగింది అనంతరం నీకు వయసు లేదు కులాంతర వివాహం వద్దు అని సమక్షంలో అమ్మాయిని తీసుకురావడం జరిగింది అప్పటినుంచి అక్క చెల్లి ఇద్దరు కూడా అమ్మానాన్నల మాటలు వినకుండా ఇష్టా రాజ్యాంగ వ్యరించడం జరుగుతుంది మీరు చదువుకోండి ఈ విధంగా చేయడం మంచిది కాదు అని తల్లి తండ్రి మందలించడంతో ఈరోజు మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయం లో కిటికీ రెయిలింగ్ కి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న బాలాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకోనీ మృతదేహాలను ఉస్మానియాకు తరలించడం జరిగింది. గతంలో మల్లికార్జున అనే యువకుడు పై బెంగళూరులో ఫోక్స కేసు నమోదు అంటూ తల్లిదండ్రులు పేర్కొన్నారు.

# ఆరోగ్యానికి యోగా శ్రేయస్కరం

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వివేకానంద యోగా సమితి అధ్యక్షులు భద్రయ్య ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ముఖ్యాతిథిగా అంతర్జాతీయ యోగా దినోత్సవం లో పాల్గొన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం వేడుకలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**యోగా గురువు భద్రయ్య మాట్లాడుతూ**

శారీరక, మానసిక ఆరోగ్యాలను పెంపొందించడంలో యోగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. భారత దేశంలో కొన్ని వేల సంవత్సరాల క్రితం నుంచీ దీన్ని అభ్యసిస్తూ వస్తున్నారు. అందుకనే ఇది ప్రపంచ దేశాల్లోనూ బాగా ప్రాచుర్యం పొందుతోంది.



మరి ఇలాంటి యోగాను రోజు వారీ వ్యాయామంలో భాగం చేసుకోవడం వల్ల మనకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో యోగా గురువు మహేందర్, వివేకానంద యోగా సమితి సభ్యులు, ఎల్లప్ప, సురేష్ గుప్తా, గణేష్ గుప్తా, మహేందర్ రెడ్డి, అజయ్ కుమార్ అయిల్ కుమార్, కాటేదాన్ స్పోర్ట్స్ వాకర్స్ యూనియన్ అధ్యక్షులు నరసింహారాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీశైలం, యాదవ్, కోశాధికారి నరేందర్, బలరాం, సభ్యులుసభ్యులు, లక్ష్మణ్, సుధామ, తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే అంజన్నకు... టీఆర్ఎస్ నాయకుల పరామర్శ

**షాద్ నగర్, మహా:** ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ను శనివారం ఎక్లాస్ ఖాన్ పేటలోని ఆయన స్వగృహంలో టీఆర్ఎస్ నాయకులు కలుసుకుని పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంజయ్య ను కలిసిన వారిలో టీఆర్ఎస్ నాయకులు గడ్డం నంద కిషోర్, నక్కల వెంకటేష్, కేశంపేట్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. మురళీధర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఆమనగంటి శివకుమార్ లు ఉన్నారు..

# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ జాతిపిత

## ఉద్యమ పితామహుడికి ఘన నివాళి

### బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ సాధనలో తన జీవితంనీ అంకితం చేసిన ఉద్యమ పితామహుడు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు సమావేశానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. మండల మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ"జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు చిహ్నం. ఆయన ఊహించుకున్న సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. విద్యార్థి జీవితం నుంచే ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయడం ఆయన జీవితంలోని గొప్పతనం. నేటి తరానికి జయశంకర్ ఆలోచనలు పరిచయం చేయడం మా బాధ్యత. తెలంగాణ సాధించినా విధా



నాన్ని ప్రజలకు పూసగొచ్చినట్టు వివరించే బాధ్యత తెలంగాణ పౌరులుగా మన నిబద్ధత. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు చేసిన పోరాటాలను మరిచిపోము. విద్యార్థుల ఆత్మహత్యల బలిదానమే నేటి తెలంగాణ రాష్ట్రం. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలన్నారు. దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ రాష్ట్రం ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేందర్, సాలివేంద్రి వెంకట్ రెడ్డి, హన్మంత్ ముదిరాజ్, గుంటి చరణ్, రాచమల్ల రమేష్, హీరేకర్ రవి పాల్గొన్నారు.

# మహా పత్రిక కథనానికి స్పందించిన కమిషనర్

## సాగర్ రహదారిపై పేరుకున్న ఇసుక తొలగింపు

### మహా పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు పట్నం పౌరులు.. ప్రతిక్షణం ప్రజల పక్షాన మహాపత్రిక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

కురిసిన వర్షాలకు సాగర్ రహదారిపై పేరుకుపోయిన ఇసుక మేటల కారణంగా, తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద, సాగర్ రహదారిపై భారీగా పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని శుక్రవారం మహా పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్, గురునానక్ కాలేజ్ ముందు ఉన్న ఇసుక మేటలను తొలగించాలని, మున్సిపల్ సిబ్బంది పెద్దగారి లక్ష్మయ్యకు ఆదేశించడంతో సాగర్ రహదారి పై పేరుకుపోయిన ఇసుకను జెసిబి సాయంతో తొలగించి, అలాగే రహదారికి ఇరు ప్రక్కల ఉన్న, దుకాణ సముదాయాల ముందు మట్టిని తొలగించడం జరిగింది. ప్రజల సమస్యల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని, ప్రజల కోసం ప్రతిక్షణం ఆలోచించే మహా పత్రిక యాజమాన్యానికి, పట్నం పౌరులు, పలువురు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# యువ మోర్చా అధ్యక్షుడి మరణం బాధాకరం

## నివాళులర్పించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కాట్రాల గ్రామానికి చెందిన చెంగల సురేష్ గౌడ్ (బీజేపీ మండల యువ మోర్చా అధ్యక్షులు) కులవృత్తి నిమిత్తం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు నుండి జారిపడి మృతి చెందారు. శనివారం ఎం.జి.ఎం ఆసుపత్రిలో మృతుదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించిన అనంతరం సురేష్ గౌడ్ మృతదేహాన్ని అంబులెన్స్ లో వారి నివాసానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ సురేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని కలిపించి పార్ధివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ధర్మ రావు , హన్మకొండ జిల్లా అధ్యక్షులు , సంతోష్ రెడ్డి , మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ , తిరుపతి రెడ్డి, రాయపురం కుమార స్వామి, రావుల కిషన్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# నేడు గోవా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కి రానున్న మిస్టర్ ఇండియా విజేత ఆర్ని రాకేష్

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్ర ముద్దు బిడ్డ మహబూబ్ నగర్ జిల్లా నవపేట్ మండలం ధర్పల్లిఊరిలో సరస్వతి యాదయ్య దంపతులకు నాలుగవ సంతానమైన రాకేష్ ఆర్నె (28) నిరుపేద కుటుంబంలో జన్మించి పలు సేవా కార్యక్రమాలు చేసుకుంటూ బాబుల్ రెడ్డి నగర్ లో నివాసము ఉంటున్నాడు. రక్షా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనదైన శైలిలో ఐక్యరాజ్య సమితి ఆహ్వానం మేరకు ఇండియా నుండి మలేషియాలో మాట్లాడే అవకాశం ఒకే ఒక్కడు రాకేష్ ఆర్నెకి రావడం గర్వించదగ్గ విషయం. ఇతర దేశాలలో పోటీలో పాల్గొంటూ ఈనాడు గోవా వేదికపై మిస్టర్ ఇండియా పోటీల్లో పాల్గొని విజయం సాధించిన రాకేష్ ఆర్నికి పాలమూరు కురువ సంఘం బిర లింగేశ్వర సైన్యం పెద్దలు కుల బాంధవులు ప్రతి ఊరిలోని అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీ తో స్వాగతం పలకడానికి ఆదివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఘనంగా స్వాగతం పలికేందుకు మిస్టర్ ఇండియా అభిమానులు ఒక్కరూ పాల్గొన్నారు.

# మానవుడి ఆరోగ్యానికి యోగ ఉపయోగకరం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** ఆరోగ్యకర జీవనయానానికి యోగ ఎంతో ఉపయోగకరమని, నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య, ఆయుష్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యోగా ఆసనాలు చేశారు. జిల్లా కలెక్టర్ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం "యోగా ఫర్ వన్ ఎర్త్ ... వన్ హెల్త్" థీమ్ చేపట్టి నట్లు తెలిపారు. శరీరాన్ని యోగా ద్వారా శుద్ధి చేసి, మంచిని ఆచరిస్తూ, మంచి ఆలోచనలతో అమూల్యమైన ఫలితాలను సాధించేందుకు దివ్యమైన ఆయుధంగా యోగా ఉపయోగపడుతుందని అన్నారు. యోగా సాధన ద్వారా మనస్సు అలజడి లేకుండా నిర్మలంగా ప్రశాంతంగా ఉంటుందని, తద్వారా వచ్చే ఆలోచనలతో మరింత ప్రభావవంతంగా ప్రజలకు సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. యోగా అనేది వ్యాయామం కాదని ,ఇది శరీరానికి ఆరోగ్యానికి, మనసుకు ప్రశాంతతను ఇచ్చే గొప్ప మార్గమని




అన్నారు. నిత్యం యోగా సాధన మానసిక వత్తిడిని జయించడానికి అవకాశం ఉంటుందని యోగా చేయడం దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా శారీరకంగా బలంగా, మానసికంగా నిలకడగా శక్తి వంతంగా ఉంటామని అన్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు యోగా చేసేందుకు సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ప్రశాంతంగా ఉన్నప్పుడు మన కుటుంబం సంతోషంగా ఉంటుందని, విధుల నిర్వహణలో అంకితభావం అలవడుతుందిని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆయుష్ వైద్యులు డా తనూజా రాణి, డిపిఓ వీరభద్రయ్య, డిఎస్పీ సంపత్ రావు, ఈడిఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా తో మంచి ఆరోగ్యం మానసిక ఉల్లాసం

## ప్రపంచ యోగ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

**హన్మకొండ మహా;** ప్రతిరోజు యోగ చేయడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగిస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో కేంద్ర పురావస్తు శాఖ, ఆయుష్ విభాగం తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తో కలిసి పాల్గొన్నారు. శిక్షణ పొందిన యోగ నిపుణులతో ప్రత్యేకంగా యోగా ఆసనాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలని, యోగ అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు. ప్రతి రోజు యోగా చేయాలనే కోరిక ఉంటున్న కూడా రోజు దినచర్య వలన సమయం కేటాయించలేక పోతున్నామని అన్నారు.

# జూన్ నెలలోపు రేషన్ కార్డుదారులందరూ సన్న బియ్యం తీసుకోవాలి

## జిల్లాలో సన్న బియ్యం 75% పంపిణీ

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లాలో సన్న బియ్యం పంపిణీ 75 శాతం పూర్తి అయినట్లు అదనపు కలెక్టర్ రెవిన్యూ అశోక్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు 3 నెలల రేషన్ ఒకే సారి పంపిణీ చేయాలన్న లక్ష్యం మేరకు జిల్లాలో రేషన్ కార్డుదారులకు ఒకేసారి 3 నెలల రేషన్ సన్న బియ్యం పంపిణీ చేయు ప్రక్రియలో బాగంగా ఇప్పటి వరకు 75 శాతం మంది లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకున్నారని, మిగిలిన లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా తీసుకోవాలని, చౌక దుకాణాల్లో స్టాకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఒకేసారి 3 నెలల రేషన్ సన్న బియ్యం పంపిణీ జూన్, జులై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ సన్న బియాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ చౌక ధరల దుకాణాల ద్వారా ఈ నెల ఒకటవ తేదీన ప్రారంభించడం జరిగినదని తెలిపారు. జిల్లాలోని 277 రేషన్ షాపుల్లో ఇప్పటి వరకు 6746.616 మెట్రిక్ టన్నులు సన్న బియ్యంను చౌక ధరల దుకాణాల లో అందుబాటులో ఉంచడం ద్వారా మన జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉన్నట్లు తెలిపారు. రేషన్ కార్డు దారులకు ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసి కార్యాలయంలో వైద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్, డీఆర్‌డీఓ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.



# మనవరాలితో కలిసి డీసీసీబీ చైర్మన్ యోగ

**రంగారెడ్డి జిల్లా మహా:** టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, తన మనవరాలితో కలిసి యోగాసనాలు వేశారు. తుర్కయంజాల్ లోని తన నివాసంలో 11వ అంతర్జాతీయ యోగా డే జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ... అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యోగాతో శరీరం, మనసు, ఆత్మ ఆరోగ్యంగా ఉంటాయన్నారు. యోగా చేయండి, ఒత్తిడిని తగ్గించండి, ఆనందంగా జీవించండని ప్రజలకు సత్తయ్య సూచించారు.

# మండలంలోని రైతులకు రైతు భరోసా అందించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలోని 10 మండలాలకు రైతు భరోసా నిధులు రైతులకు అందకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ కాకపోవడంతో నిరాశ చెందుతున్నారని సిపిఎం నాయకులు సామెల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రైతులకు రైతు భరోసా ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు ఆధ్వర్యంలో పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేలు మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం మండలంలోని రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో రైతులకు రైతు భరోసాను నిలిపివేయడం సరైనది కాదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న రంగారెడ్డి జిల్లాలోని 10 మండలాలకు రైతు భరోసా నిలిపివేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ కు ఆనుకొని ఉన్న మండలాలలోని రైతులు ఆకుకూరలు, కూరగాయలు పండించి చాలా అభివృద్ధి అయ్యారనే సాకుతో రైతు భరోసా నిలిపివేయడం సిగ్గుచేటు అన్నారు. భూమిని సాగు చేసుకోని జీవిస్తున్న ప్రజలకు ఆసరా కావలసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలపై వివక్షత చూపడం సరికాదన్నారు. దాదాపు ఇబ్రహీంపట్నం మండలంలో 20వేల మంది రైతులకు రైతు భరోసా నిలిపివేశారన్నారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఇబ్రహీంపట్నం మండలంలోని రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, ఈనెల 23న ఇబ్రహీంపట్నం తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## నాన్న చెప్పిన ఒక్క మాటతో రూ.1,200 కోట్లు సంపాదన




ప్రముఖ నటుడు, పారిశ్రామికవేత్త వివేక్ ఒబెరాయ్ సంపద ఫోర్బ్స్ ఇండియా ప్రకారం దాదాపు రూ.1,200 కోట్లుగా ఉంది. 'సాథియా', 'మస్తీ', 'రక్త చరిత్ర' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వివేక్ ఒబెరాయ్ ఇప్పుడు సినిమాల్లో తక్కువగానే కనిపిస్తున్నారు. ప్రస్తుతం దుబాయ్ వెళ్లి ఫుల్ టైమ్ ఆంత్రప్రెన్యూర్‌గా మారారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యాపార సామ్రాజ్య పునాదికి దారితీసిన అంశాల గురించి, తండ్రి సురేష్ ఒబెరాయ్ చిన్నతనం నుంచే తనకు ఫైనాన్షియల్ ఫ్రీడమ్ గురించి ఎలా నేర్పించారో చెప్పారు.

దుబాయ్ ప్రాపర్టీ ఇన్‌సైడర్ పాడ్‌కాస్ట్‌లో వివేక్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. 'వ్యాపార మెలకువలు నేర్చుకునే తొలినాళ్లలో నాలో ఆర్థిక అవగాహన పెంపొందించిన ఘనత నా తండ్రికే దక్కుతుంది. అతను ఒక ప్రొడక్ట్ తీసుకొచ్చి నేను దాన్ని ఎలా విక్రయించబోతున్నాననే దానిపై వ్యాపార ప్రణాళికను రూపొందించమని అడిగేవారు. దాంతో నేను 10 ఏళ్ల వయసు నుంచే వ్యాపారంలోని సూక్ష్మాంశాలను అర్థం చేసుకోవడం ప్రారంభించాను. సంపన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ నా తండ్రి ఒక విషయం స్పష్టంగా చెప్పారు. తాను ధనవంతుడినని.. మేము కాదనే చెబుతుండేవారు. మేము ఎలా ఉండాలో నిర్ణయించుకోమన్నారు' అని చెప్పారు.

'ఈ కఠినమైన ప్రేమతో కూడిన విధానం టీనేజ్ నుంచే నన్ను తోటివారి కంటే భిన్నంగా ఆలోచించేలా చేసింది. చాలా మంది టీనేజర్లు స్కూళ్లలోని పాఠాలు నేర్చుకుంటుంటే.. నేను మాత్రం మార్కెట్, వ్యాపారం, స్టాక్స్.. వంటి ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన పెంచుకున్నాను. దాంతో నా మొదటి కంపెనీ కోసం 3 మిలియన్ డాలర్లు కూడబెట్టగలిగాను. అప్పుడు నా వయసు 19 ఏళ్లు. తర్వాతి కాలంలో నా పెట్టుబడిదారుల కోసం చాలా డబ్బు సంపాదించాను. నా 23 ఏళ్ల వయసులో ఆ కంపెనీని విక్రయించాను. తర్వాత ఇతర కంపెనీలను కొనుగోలు చేశాను. ప్రస్తుతం తొమ్మిది సంస్థలను భారత స్టాక్ మార్కెట్లోకి తీసుకెళ్లగలిగాను. మరో నాలుగు కంపెనీలను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని యోచిస్తున్నాను' అని తెలిపారు.

## ఓపెన్ ప్లాట్లకూ రుణాలు!



సాధారణంగా అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు వంటి నిర్మాణ సంబంధమైన ప్రాపర్టీలకు బ్యాంక్‌లు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు గృహ రుణాలు ఇస్తుంటాయి. ఓపెన్ ప్లాట్లు, స్థలాల కొనుగోళ్లకు రుణాల మంజూరు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. పలు థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఓపెన్ ప్లాట్లకు సైతం రుణాలను మంజూరు చేపిస్తున్నాయి. ఓపెన్ ప్లాట్ల మార్కెట్ బాగుండి, మంచి అనుభవం ఉన్న డెవలపర్లకు ఫండింగ్ చేస్తుంటారు. ప్లాటింగ్ వెంచర్‌లో నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుంది. స్థలం కొన్న తర్వాత రోడ్లు, లైటింగ్, ఎలక్ట్రిసిటీ వంటి ఖర్చులకు మినహా పెద్దగా వ్యయం కాదు. అందుకే స్థలం కొనేందుకు కూడా లోన్లను ఇస్తుంటారు.

### నాలుగు గోడలకు కాలం చెల్లింది..


**బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నిధుల కొరతతో రియల్టీ ప్రాజెక్ట్‌లకు రుణాలు అంత ఈజీగా దొరకడం లేదు. కొత్త ప్రాజెక్ట్‌లకు లోన్స్ సంగతి దేవుడెరుగు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకూ ఫండింగ్ దొరకటం కష్టంగా మారింది. నాలుగు గోడల ఇంటికి కాలం చెల్లింది. కాంక్రీట్ భవనాలకు కొనుగోలుదారులు స్వస్తి పలికేశారు. సాంకేతికతను వినియోగించే టెకీ భవనాలు, ఆధునిక వసతులుండే విలాస గృహాలకు జై కొడుతున్నారు.**

## అదే జరిగితే పెట్రోల్, డీజిల్ రేట్లకు రెక్కలే!




ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. యుద్ధం మొదలైన గత శుక్రవారం నాడు (జూన్ 13న) ఒకే రోజున ఏకంగా 11 శాతం ఎగిసింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ రేటు ఎకాయెకిన 70.50 డాలర్ల నుంచి 78.50 డాలర్లకు పెరిగి, ఆరు నెలల గరిష్ఠానికి చేరింది. వారం రోజులుగా ఆ గరిష్ట స్థాయిలోనే తిరుగుతోంది. యుద్ధం ఇదే విధంగా కొనసాగి, చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జల సంధిని ఇరాన్ గానీ మూసివేస్తే ముడి చమురు రేట్లు 120-130 డాలర్ల వరకు కూడా ఎగిసే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి. ఒకవేళ అదే జరిగితే, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లకూ రెక్కలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశం ఇరాన్ నుండి నేరుగా చమురు దిగుమతి చేసుకోకపోయినా, మధ్యప్రాచ్య స్థిరత్వం ప్రభావం భారతీయ మార్కెట్‌పై పడుతుంది. పర్షియన్ గల్ఫ్ ను గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంతో కలుపుతూ హర్మూజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా కేంద్రాలలో ఒకటిగా ఉంది. ఇది ఇరాన్, ఒమన్ మధ్య ఇరుకైన జలమార్గం. పర్షియన్ గల్ఫ్ నుండి ముడి చమురు ఎగుమతుల్లో 85% కంటే ఎక్కువ దీని ద్వారా వెళుతుంది. 2024లో ఈ జలసంధి రోజుకు సగటున 20 మిలియన్ బ్యారెల్స్ ప్రవాహాన్ని చూసింది. ఇది ప్రపంచ పెట్రోలియం వినియోగంలో ఐదవ వంతు. ఇరాన్ ఈ జలసంధిని అడ్డుకోవడం గానీ, ఏదైనా అంతరాయం జరిగితే చమురు కొరత తీవ్రమై ధరల పెరుగుదలకు దారితీస్తుంది. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఈ మార్గం గుండా వెళ్ళే చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అంతరాయాల వల్ల ఈ దేశాలు ఏదైనా ఎక్కువగా ప్రభావితమవుతాయి.

## దేశీయ కళలకు జీవం పోసేలా ఎన్ఎంఏసీసీ భారీ ఈవెంట్



భారతీయ కళలు ఉట్టిపడేలా నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఏసీసీ) ఇండియా వీకెండ్‌ను న్యూయార్క్ నగరంలోని లింకన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు నీతా అంబానీ తెలిపారు. ఈ వేడుక 2025 సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు జరగనుందని చెప్పారు. ఈమేరకు 'ఎన్ఎంఏసీసీ.ఇండియావికెండ్' ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో వివరాలు వెల్లడించారు. భారతీయ కళల వారసత్వం, సంప్రదాయ నృత్యాలు, సంగీతం, ఫ్యాషన్, వంటకాలు.. వంటి ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు ఇందులో ఉండనున్నాయని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లోని వివరాల ప్రకారం.. 'ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్' ఈవెంట్‌లో భాగంగా సాంప్రదాయ నృత్యాలు ఉంటాయని నీతా అంబానీ తెలిపారు. దాంతోపాటు ఈ హై ప్రొఫైల్ ఈవెంట్ సెలబ్రిటీల ఫ్యాషన్ షో, దేశ హస్తకళలు, సమకాలీన డిజైన్లకు వేదికగా నిలుస్తుందని చెప్పారు. క్రీస్తుపూర్వం 5000 నుంచి 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు దేశీయ పరిణామాలను తెలియజేసేలా నాటకాలుంటాయని చెప్పారు. ప్రదర్శనలు, దృశ్యాలు, కథల ద్వారా ఈ ఈవెంట్ చరిత్రకు జీవం పోస్తుందని నీతా అంబానీ చెప్పారు.

## బీఎస్ఎన్ఎల్ కొత్త సర్వీస్..




ప్రభుత్వ రంగ టెలికాం ఆపరేటర్ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సరికొత్త 5జీ ఇంటర్నెట్ సర్వీస్‌ను ప్రారంభించింది. దేశంలోనే తొలిసారి క్యూ5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ లాంచ్ చేసింది. ఇది సంస్థలకు, కార్యాలయాలకు సిమ్ రహిత, వైర్‌లెస్ పరిష్కారాన్ని అందిస్తుందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది.

**ఏమిటీ క్యూ-5జీ?**

క్యూ5జీ.. ఇక్కడ క్యూ అంటే క్వాంటమ్. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ చాలా అరుదుగా ఉండే టైర్ 2, టైర్ 3 నగరాలను లక్ష్యంగా చేసుకుని బీఎస్ఎన్ఎల్ కొత్త క్యూ5జీ ఎఫ్‌డబ్ల్యూఏ సేవలను ప్రారంభించింది. భారతదేశంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బీఎస్ఎన్ఎల్ రూపొందించిన ఈ సరికొత్త సర్వీస్ వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, నెట్వర్క్ లేని నివాస ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడంలో సహాయపడుతుంది. అయితే, ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా అందించే సాధారణ 5జీ సేవల మాదిరిగా కాకుండా బీఎస్ఎన్ఎల్ క్యూ 5జీ ఎఫ్‌డబ్ల్యూఏలో వాయిస్ సదుపాయం ఉండదు. అంటే దీని ద్వారా వినియోగదారులు కాల్స్ చేయలేరు. సిమ్ లేదా వైర్లు లేకుండా వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ఫైబర్, జియో ఎయిర్ ఫైబర్ మాదిరిగానే ఇది ఉంటుంది. మిగిలిన వైర్‌లెస్ ఇంటర్నెట్ సర్వీసుల మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ క్యూ5జీ తీసుకున్న కస్టమర్లకు వారి ఇళ్లపై సీపీఈ పరికరాలను ఏర్పాటు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ కొత్త క్యూ5జీ సర్వీస్ 100 ఎంబీపీఎస్ కనీస వేగాన్ని అందిస్తుంది. ఇందుకోసం నెలకు రూ .999 ఖర్చు అవుతుంది. అదే 300 ఎంబీపీఎస్ వేగం కావాలంటే రూ.1,499 ప్లాన్‌ను అందిస్తోంది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ క్యూ5జీ ఎఫ్‌డబ్ల్యూఏ హైదరాబాద్‌కే పరిమితం కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి బెంగళూరు, పాండిచ్చేరి, విశాఖపట్నం, పుణె, గ్వాలియర్, చండీగఢ్ వంటి నగరాలకు ఈ సేవలను విస్తరించాలని యోచిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే తెలిపింది.




# దేశం-విదేశం
NATIONAL-INTERNATIONAL



## ఇప్పుడు ఇల్లు.. ఇలా కొనడమే ఇష్టం

**గృహ కొనుగోలుదారుల అభిరుచి మారింది. గతంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనేందుకు ఆసక్తి చూపిన కస్టమర్లు.. ప్రస్తుతం లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనేందుకు ఇష్టపడుతున్నారు. 2023లో రెడీ టూ మూవ్, లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్ల నిష్పత్తి 46:18 శాతంగా ఉండగా.. 2024 నాటికి 23:24 శాతానికి చేరింది. అలాగే రూ.కోటిన్నర ధర ఉన్న లగ్జరీ గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023లో 20 శాతం మంది లగ్జరీ ఇళ్లకు ఆసక్తి చూపించగా.. 2024 నాటికి 35 శాతానికి పెరిగిందని ఫిక్కీ, అనరాక్ సర్వేలో వెల్లడించింది**




### బాల్కనీ మస్ట్..

1, 2, 3 బీహెచ్‌కే.. ఇల్లు ఏదైనా సరే బాల్కనీ ఉండాల్సిందే. గృహ కొనుగోలుదారులు నిర్మాణం నాణ్యత, ప్రాంతం, ధర, వసతులతో పాటు బాల్కనీకి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఇంటిలోని ప్రతి అంగుళం స్థలాన్ని వినియోగించాలని భావించిన కస్టమర్లు.. ప్రస్తుతం ఎక్కువ ఓపెన్ స్పేస్ ఉండాలని కోరుకుంటున్నారు. 75 శాతం మంది బాల్కనీ ఉండే ఇళ్ల కొనుగోళ్లకే ఆసక్తి చూపించగా, 74 శాతం మంది కస్టమర్లు నాణ్యమైన నిర్మాణాలకే మొగ్గు చూపిస్తున్నారు. అనరాక్ రీసెర్చ్ దేశంలోని పలు నగరాలలో 5,510 మందిపై ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించింది. గృహాల ధరలు పెరుగుతున్నప్పటికీ కొనుగోలుదారుల విశాలమైన ఇళ్లకే ఆసక్తి చూపిస్తున్నారు. 50 శాతం మంది కస్టమర్లు 3 బీహెచ్‌కే కొనుగోలుకు ఆసక్తి చూపిస్తే.. 38 శాతం మంది 2 బీహెచ్‌కే గృహాలకు మొగ్గు చూపిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే యూనిట్లకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అధిక ధరల కారణంగా ముంబైలో 44 శాతం మంది కస్టమర్లు 2 బీహెచ్‌కేలకు, 17 శాతం 1 బీహెచ్‌కేలకు ఆసక్తి చూపిస్తున్నారు. పుణేలో 10 శాతం కొనుగోలుదారులు 1 బీహెచ్‌కే జై కొడుతున్నారు.

### పెట్టుబడులకు రియలే బెటర్..

ఏటా దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఫ్లాట్ల విస్తీర్ణాలు 11 శాతం మేర పెరుగుతున్నాయి. 2022లో 1,175 చ.అ.లుగా ఉన్న సగటు ఫ్లాట్ల సైజు.. 2023 నాటికి 1,300 చ.అ.లకు పెరిగాయి. 58 శాతం మిలీనియల్స్, 39 శాతం జెన్స్-ఎక్స్ కస్టమర్లు ఇతర పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలతో ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 57 శాతం మంది రియల్ ఎస్టేట్ అత్యంత ప్రాధాన్య పెట్టుబడిగా విశ్వసిస్తున్నారు. ఇందులోనూ 36 శాతం మంది నివాస విభాగంలో పెట్టుబడులకే ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రుణ వడ్డీ రేట్లు 8.5 శాతం కంటే తక్కువగా ఉన్నంత కాలం ఇంటి కొనుగోలు నిర్ణయంపై ప్రభావం ఉండదని చెప్పారు.

## ఉక్రెయిన్ మొత్తం మాదే.. పుతిన్ సంచలన ప్రకటన




**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన ప్రకటన చేశారు. రష్యన్లు, ఉక్రెయిన్లు ఒక్కటేనని.. ఉక్రెయిన్ మొత్తం రష్యాదే అంటూ వ్యాఖ్యలు చేశారు. దీని ప్రకారం ఉక్రెయిన్ మొత్తం తమదేనని అన్నారు. దీంతో, పుతిన్ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు తెర లేపాయి. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరంలో వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ..'ఉక్రెయిన్‌ను నాశనం చేయాలనే ఉద్దేశం మాకు లేదు. ఇదే విషయం నేను ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. ఉక్రెయిన్ తమకు తాముగా సమస్యలను సృష్టించుకుంటోంది. రష్యన్లు, ఉక్రెయిన్లు ఒక్కటే. దీని ప్రకారం ఉక్రెయిన్ మొత్తం మాదే. ఉక్రెయిన్ నగరం సుమీని స్వాధీనం చేసుకోవాలనే లక్ష్యం మాకు లేదు. ఉక్రెయిన్‌లో శాంతి సాధించాలనుకుంటే మాతో కలిసి రావాలి. మేము ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ఎప్పుడూ ప్రశ్నించలేదు. అలాగే, ఉక్రెయిన్ లొంగిపోవాలని కూడా మేము కోరుకోవడం లేదు. రష్యా శాంతికి కట్టుబడే ఉంది. ఉక్రెయిన్ నాటోలో చేరాలనే ఆకాంక్షలను వదులుకోవాలి. ఉక్రెయిన్ ఆక్రమిత ప్రాంతాలపై మాస్కో నియంత్రణను అంగీకరించాలి. ఉక్రెయిన్ స్వతంత్రంగా మారిన 1991 ఒప్పందాలను గుర్తుచేసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

### ఖండించిన పుతిన్

అయితే, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని నివాస ప్రాంతాలపై తాము దాడి చేశామన్న వ్యాఖ్యలను పుతిన్ ఖండించారు. తమ సైన్యం అటువంటి లక్ష్యాలను ఢీకొట్టలేదని వెల్లడించారు. తాము నివాస గృహాలపై దాడులు చేయలేదని, సైనిక స్థావరాల పైనే చేశామన్నారు. జెలెన్ స్కీతో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కానీ గతేడాది తన పదవీకాలం ముగియడంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తన చట్టబద్ధతను కోల్పోయారని ఆరోపించారు. ఈ సందర్భంగా పుతిన్..'జెలెన్ స్కీతో సహా ఎవరినైనా కలవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అది సమస్య కాదు. ఉక్రెయిన్ ఆయనకు చర్చలు జరిపే బాధ్యత అప్పగిస్తే, జెలెన్ స్కీనే అనుమతించండి. అసలు ప్రశ్న ఏమిటంటే ఫలితంగా వచ్చే పత్రాలపై ఎవరు సంతకం చేస్తారు? సంతకం చట్టబద్ధమైన అధికారుల నుంచి రావాలి. జెలెన్ స్కీ అధ్యక్ష పదవీకాలం గతేడాది అధికారికంగా ముగిసింది. మార్షల్ లా విధించడం వల్ల అతడి వారసుడిని ఎన్నుకోలేదు. ఉక్రెయిన్ రాజ్యాంగం ప్రకారం పదవీ కాలం ముగిస్తే అధ్యక్ష అధికారాలను పార్లమెంటు స్పీకర్‌కు బదిలీ చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తాను పదవిలో కొనసాగవచ్చని జెలెన్ స్కీ వాదిస్తున్నారు. అయితే తీవ్రమైన సమస్యలను పరిష్కరించేటప్పుడు మేము చట్టపరమైన అంశాల గురించి శ్రద్ధ వహిస్తాం. సంతకం చట్టబద్ధమైన అధికారుల నుంచి రావాలి. లేకపోతే జెలెన్ స్కీ తర్వాత ఎవరు వచ్చినా దానిని చెత్తబుట్టలో వేస్తారు' అని వ్యాఖ్యలు చేశారు.

## ఇరాన్ కీలక డ్రోన్ కమాండర్ హతం

### ఇజ్రాయెల్ వెల్లడి




**జెరూసలేం:** ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. శుక్రవారం ఇరుదేశాలు వైమానిక దాడులకు దిగాయి. ఈ యుద్ధం ఎనిమిదవ రోజుకు చేరింది. మరోవైపు అణు చర్చలను పునరుద్ధరించేందుకు, ఘర్షణలు మరింత తీవ్రతరం కాకుండా నిరోధించేందుకు యూరోపియన్ దౌత్యవేత్తలు జెనీవాలో సమావేశమైన తరుణంలోనూ ఇరు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. టెహ్రాన్ హైఫా, బీర్షెబా వద్ద భీకరంగా క్షిపణుల దాడి జరిగిందని, దీనిలో ఇరానియన్ కీలక డ్రోన్ కమాండర్ హతమయ్యాడని పేర్కొంది. మరోవైపు ఇరాన్ మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ.. ఇరాన్‌లో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ 657 మంది మృతిచెందగా, రెండువేల మందికి పైగా జనం గాయపడ్డారని తెలిపింది. కాగా జెనీవాలో, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈయూ విదేశాంగ విధాన చీఫ్, యూకే, ఫ్రాన్స్, జర్మనీ మంత్రులతో చర్చలు జరిపారు. యూరోపియన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ 'ఇరాన్.. యూరప్‌తో మాట్లాడటానికి ఇష్టపడటం లేదని, వారు తమతో మాట్లాడాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. యుద్ధ తీవ్రతను తగ్గించడానికి లేదా అమెరికా జోక్యాన్ని అనుమతించేందుకు రెండు వారాల గడువు మాత్రమే ఉందని ట్రంప్.. టెహ్రాన్(ఇరాన్)ను హెచ్చరించారు. ఇదే సమయంలో ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు ఇజ్రాయెల్ సుదీర్ఘ ప్రచారం నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

## ఉత్సాహంగా జపాన్ ప్రధాని భార్య యోషికో యోగాసనాలు



టోక్యో: ఈరోజు (జూన్ 21) అంతర్జాతీయ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు యోగా సంబంధిత కార్యక్రమాలు జరుగుతున్నాయి. జపాన్‌లోని టోక్యోలోగల భారత రాయబార కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండువేల మందికిపైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జపాన్ ప్రధాని షిగేరు ఇషిబా భార్య యోషికో ఇషిబా యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోషికో ఇషిబా అందరితో పాటు యోగా ఆసనాలు వేయడంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా భార్య సతోకో ఇవాయా కూడా యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐడీవై ఈవెంట్ భారత్ జపాన్ దేశాల సాంస్కృతిక, దౌత్య సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. జపాన్‌లో భారత రాయబారి సీబీ జార్జ్ మాట్లాడుతూ మనకు శారీరక, మానసిక ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. టోక్యోలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రెండు వేలకు పైగా యోగా ఔత్సాహికులు పాల్గొనగా, రెవరెండ్ మైయోకెన్ హయామా, రెవరెండ్ టోమోహిరో కిమురా, సీనియర్ ప్రభుత్వ అధికారులు, రాయబారులు, దౌత్యవేత్తలు పాల్గొన్నారు. ఈ యోగా దినోత్సవ కార్యక్రమ వివరాలను భారత రాయబార కార్యాలయం 'ఎక్స్'లో తెలిపింది.

## ప్రభాస్ రెమ్యునరేషన్‌లో భారీ కోత...
# ఇక నెం.1 కాదా?



టాలీవుడ్‌లో నిన్నా మొన్నటి దాకా నెంబర్ వన్ హీరో అంటే తడుముకోకుండా చెప్పగలిగిన పేరు ప్రభాస్(Prabhas). దర్శక దిగ్గజం రాజమౌళి తీసిన బాహుబలి 2 సినిమాలు ప్రభాస్ స్టార్ డమ్‌ని మిగిలిన హీరోలకు అందనంత స్థాయికి తీసుకెళ్లిపోయాయి. టాలీవుడ్ ను దాటేసి పాన్ ఇండియా స్థాయికి ఎగబాకిన క్రేజ్‌తో ప్రభాస్ రెమ్యునరేషన్ కూడా అదే స్థాయిలో పెరిగిపోయింది. అటు రెమ్యునరేషన్ పరంగా గానీ, అఖిలభారత స్థాయి ఇమేజ్ పరంగా గానీ చూస్తే టాప్‌లో నిలిచాడు ప్రభాస్. అయితే ఇదంతా ఇప్పుడు గతం. ఆర్ఆర్ఆర్, పుష్ప సినిమాల తర్వాత ప్రభాస్ నెంబర్ వన్ స్థానం బీటలు వారింది. ఆ స్థానానికి అల్లు అర్జున్ రూపంలో గట్టి పోటీ ఎదురైంది. ఈ నేపథ్యంలో రెమ్యునరేషన్ పరంగానూ ప్రభాస్ తగ్గాడనే వార్త ఒకటి సినిమా పరిశ్రమలో వినిపిస్తోంది.

భారీ రెమ్యునరేషన్ తీసుకునే స్టార్ హీరోల్లో ముందుండే ప్రభాస్, మళ్లీ హారర్ కామెడీ మూవీ 'ది రాజా సాబ్'(The Raja Saab Movie) అనే సినిమాతో తెరపైకి రానున్న సంగతి తెలిసిందే. హాస్య చిత్రాలకు పేరొందిన మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ అందుకున్న పారితోషికం గురించి వినిపిస్తున్న వార్తలు ప్రభాస్ నెంబర్ వన్ స్థానాన్ని చర్చనీయాంశంగా మార్చాయి.

బాహుబలి తర్వాత సాధారణంగా ఒక్క సినిమాకు రూ.150 కోట్ల వరకు వసూలు చేస్తున్నాడట ప్రభాస్, అలాంటిది ఈ ప్రాజెక్ట్ కోసం మాత్రం రూ.100 కోట్లకే ఓకే చెప్పినట్లు సమాచారం. అంటే ఏకంగా రూ.50 కోట్ల తగ్గింపుని ఆయన అంగీకరించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు ముందు విడుదలైన 'ఆదిపురుష్' సినిమా భారీగా వసూళ్లు సాధించలేకపోవడం, ప్రభాస్ నటన, గెటప్ కూడా తీవ్రంగా ట్రోలింగ్‌ను ఎదుర్కొనడం వంటి వాటి వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నారు.

ఏదేమైనా ఇది ప్రభాస్ నెం1 స్టార్ ఇమేజ్‌ని సందేహాస్పదం చేసేదే. అయితే రెమ్యునరేషన్‌లో తగ్గింపును అంగీకరిస్తూన్న కొందరు ప్రభాస్ అభిమానులు చెబుతున్న ప్రకారం...ఇది ఇమేజ్‌కు సంబంధించినది కాదు. 'ది రాజా సాబ్' కు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మాణ బాధ్యతలు చూస్తోంది. ఇదే సంస్థ ఆదిపురుష్ ను కూడా నిర్మించింది. కాబట్టి ఆది పురుష్ ద్వారా నష్టాలను ఎదుర్కున్న నిర్మాతలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభాస్ తన వంతుగా ఈసారి కొంచెం వెనక్కి తగ్గారని అంతే తప్ప ఆయన క్రేజ్‌కు ఏ మాత్రం తగ్గింపు లేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పుష్ప సిరీస్‌తో మంచి దూకుడు మీదున్న బన్నీ... అట్లీ సినిమాకు భారతీయ సిని చరిత్రలోనే ఎవరూ అందుకోనంత రెమ్యునరేషన్ అందుకుంటున్నాడని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ ఇలా వెనుకడుగు వేయడం టాలీవుడ్ నెం1 ఫైట్‌ను ఆసక్తిగా మారుస్తోంది.

ఇక ది రాజా సాబ్ సినిమా విషయానికి వస్తే.. రొమాంటిక్ హారర్ కామెడీగా భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో తెరకెక్కుతోంది. ఇందులో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. దర్శకుడు మారుతి కి ఇది ఓ పెద్ద స్కేల్ ప్రాజెక్ట్ కానుండగా, నిర్మాతగా టీ.జి. విశ్వప్రసాద్ వ్యవహరిస్తున్నారు. సినిమా విడుదల తేదీని డిసెంబర్ 5, 2025 గా ప్రకటించారు. ఈ సినిమా మరోసారి తమ హీరో సత్తా ఏంటో చూపించనుందని ప్రభాస్ అభిమానులు బల్ల గుద్ది చెబుతున్నారు.

# కుబేర విలన్..
## ఇతడు ఎవరో తెలుసా?



ఏ సినిమా అయినా సరే హీరోయిజం పండాలంటే అందుకు ఎదురుగా ఉన్న పాత్ర కూడా అంతే పండాలి. ఇప్పుడు థియేటర్లలోకి వచ్చిన 'కుబేర' విషయంలోనూ ఇదే జరిగినట్లు అనిపిస్తుంది. ధనుష్(Dhanush), నాగార్జున(Nagarjuna Akkineni) లాంటి స్టార్స్ ఉన్నప్పటికీ తనదైన విలనిజంతో నటుడు జిమ్ షర్భ్ ఆకట్టుకున్నాడు. ఇదే ఇతడికి తొలి సినిమా అయినా సరే.. విలనిజంతో అదరగొట్టేశాడని చెప్పొచ్చు. ఇంతకీ ఇతడు ఎవరు? బ్యాక్ గ్రౌండ్ ఏంటి?

ముంబైకి చెందిన జిమ్ షర్భ్ సీనియర్ నటుడేం కాదు. ఇతడి వయసు జస్ట్ 37 ఏళ్లే. తండ్రి ఉద్యోగం వల్ల చిన్నప్పుడే విదేశాలు తిరిగిన జిమ్.. అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ సైకాలజీ చేశాడు. తర్వాత 2014లో హిందీలో నటుడిగా కెరీర్ ప్రారంభించాడు. తొలి మూవీ షురురత్ కి ఇంటర్వెల్ ఫ్లాప్. దీంతో రెండేళ్లు వెయిటింగ్ తప్పలేదు. 2016లో వచ్చిన 'నీర్జా' ఇతడి కెరీర్‌ని మలుపు తిప్పిందనే చెప్పొచ్చు. ఏకంగా ఐదు అవార్డులు వచ్చాయి. అలా కాస్త గుర్తింపు తెచ్చుకున్నాడు. తర్వాత అడపాదడపా సినిమాలు చేస్తున్నాడు.

బాలీవుడ్‌లో పద్మావత్, సంజు సినిమాల్లో ఇతడు విలనిజంతో ఆకట్టుకున్నాడు. అలా శేఖర్ కమ్ముల దృష్టిలో పడ్డాడు. 'కుబేర'లో అవకాశం దక్కించుకున్నాడు. స్వతహాగా హిందీ నటుడు అయినప్పటికీ.. డబ్బింగ్‌కి సరిపోయేలా యాక్టింగ్ చేయగలిగాడు. సినిమాలో ఇతడి నటనకు కూడా మంచి మార్కులే పడుతున్నాయి. మూవీ చివర్లో ఇతడి పాత్ర కూడా బిచ్చగాడిగా కనిపించడం ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది.

అలా తెలుగులో 'కుబేర' సినిమాతో తొలి ప్రయత్నంలో ఆకట్టుకున్న జిమ్.. త్వరలో మరిన్ని తెలుగు చిత్రాల్లో కనిపించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. తెలుగులో ప్రకాశ్ రాజ్, రావు రమేశ్ విలనిజం చూసి చూసి జనాలకు మొనాటనీ వచ్చేసింది. ఇలాంటి టైంలో జిమ్‌కి అవకాశాలు వస్తే టాలీవుడ్‌లో కొత్త విలన్ పుట్టుకొచ్చినట్లే.



## రెండోసారి గర్భం దాల్చిన హీరోయిన్..
# నిజమేనా?



బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ మరోసారి గర్భం దాల్చిందని కొన్ని వారాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ఆలియా హాజరైనప్పటి నుంచి ఈ రూమర్స్ మొదలయ్యాయి. పైగా జిమ్‌కు వెళ్లినప్పుడు కూడా కెమెరాలు కనిపించగానే ఎవరినీ పలకరించకుండా హడావుడిగా వెళ్లి కారులో కూర్చునేది. దీంతో నిజంగానే ఆలియా ప్రెగ్నెంట్ అయిందేమోనన్న అనుమానాలు వెలువత్తాయి.

### డ్యాన్స్ రిహార్సల్స్..

కానీ, హీరోయిన్ లేటెస్ట్ వీడియోతో ఇవన్నీ వుట్టి పుకార్లేనని తేలిపోయాయి. ఆల్ఫా సినిమా కోసం డ్యాన్స్ రిహార్సల్స్ చేసిన ఆలియా తాపీగా వెళ్లి కారెక్కింది. మధ్యలో అక్కడున్నవారిని కూడా పలకరించింది. పైగా తనకు పొట్ట కూడా లేకపోవడంతో సెకండ్ ప్రెగ్నెన్సీ అంటూ వస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని తేలిపోయింది.

### రాహా మూడో బర్త్ డే..

ఆలియా భట్ - రణ్‌బీర్ కపూర్ 2022లో పెళ్లి చేసుకున్నారు. అదే ఏడాది కూతురు రాహా జన్మించింది. ఈ ఏడాది రాహా మూడో బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోనుంది. సినిమాల విషయానికి వస్తే ఆలియా ప్రస్తుతం 'ఆల్ఫా' మూవీ చేస్తోంది. 'ముంజ్య' హీరోయిన్ శార్వరితో కలిసి నటిస్తున్న ఈ మూవీ క్రిస్మస్‌కు విడుదల కానుంది.

## స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా
# చిరంజీవి!

కాలేజ్ లెక్చరర్‌గా చిరంజీవి ఆడియన్స్ ను ఎలా ఎంటర్‌టైన్ చేశారో 'మాస్టర్' (1997) సినిమాలో చూశాం. మరి... స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా ప్రేక్షకులను ఎలా మెప్పించనున్నారో వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌కి వెళ్లి చూడొచ్చట. చిరంజీవిహీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాల్లో స్కూల్ డ్రిల్ మాస్టర్ శివశంకర వరప్రసాద్‌గా చిరంజీవి కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. అలాగే గురువారంతో ముస్సోరీలో పూర్తయిన ఈ సినిమా రెండో షూటింగ్ షెడ్యూల్‌లో స్కూల్ నేపథ్యంలోని సన్నివేశాలను చిత్రీకరించారట అనిల్ రావిపూడి. ఈ సీన్స్‌లో చిరంజీవి, నయనతారతో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొన్నట్లుగా తెలిసింది. ఇంకా ఈ సినిమాలోని ఓ అతిథి పాత్రలో వెంకటేశ్ నటిస్తారని, నటి క్యాథరీన్ మరో కీలక పాత్రలో కనిపిస్తారని టాక్. ఇక ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.

## ఆసక్తిరంగా
# స:కుటుంబానాం టీజర్



ఈ మధ్యకాలంలో కంటెంట్ ఉన్న సినిమాలు ఏ రేంజ్ లో ప్రేక్షకులని ఆకట్టుకుంటున్నాయో చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమా కూడా అలాంటి కోవలోకే వెళ్తుంది అని చెప్పచ్చు. ఫ్యామిలీ మ్యాన్ అనిపించుకుంటున్న కథానాయకుడు ఫ్యామిలీనీ హేట్ చేస్తూ కనిపించిన ఈ టీజర్ తో కథ తాలూకు కొత్తదనం చెప్పకనే చెప్పారు దర్శక రచయిత ఉదయ్ శర్మ. మణిశర్మ సంగీతం అందించిన ఈ సరికొత్త కుటుంబ కథా చిత్రంలో రాజేంద్రప్రసాద్, రామ్ కిరణ్, మేఘా ఆకాష్, బ్రహ్మానందం, సత్య, గిరి, భద్రం ముఖ్య తారాగణంగా.. ప్రేక్షకులని అలరించబోతున్నారు. ఈ చిత్ర టీజర్ విషయానికి వస్తే ఒక పక్క నుండి అర్జున్ రెడ్డి లాంటి వైబ్స్ కనిపిస్తూనే మరోపక్క కుటుంబ సమేతంగా చూసే చిత్రం అని అర్థమవుతుంది. టీజర్ లోని ప్రతి డైలాగ్, విజువల్ ఎంతో అద్భుతంగా ఉన్నాయి. అలాగే సత్య, బ్రహ్మానందం గారి హాస్యం చిత్రంలో బాగా పండుతుందని అనిపిస్తుంది. మేఘా ఆకాష్ మంచి క్యారెక్టర్ ప్లే చేసినట్లు అర్థమవుతుంది. రామ్ కిరణ్ ఈ చిత్రం ద్వారా ఇండస్ట్రీలో ఒక మార్క్ సృష్టిస్తారు నడిపించేలా తన ప్రెసెన్స్ & పర్ఫార్మెన్స్ కనిపిస్తుంది. కుటుంబం విషయాలలో హీరో ఉద్దేశం అందరిలా సహజంగా ప్రేమగా కాకుండా కాస్త కొత్తగా ఉంటుందని ఈ చిత్ర టీజర్ అనిపిస్తుంది. టీజర్ లోని సంగీతం చాలా బాగుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## తనకోసం మనకోసం సమాజం కోసం యోగా

### గురునానక్ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గురు నానక్ విద్యాసంస్థలు, యూనివర్సిటీ సంయుక్త సమన్వయంతో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం పరిధిలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మరియు గురునానక్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఇంటర్నేషనల్ యోగా డేను ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు, యోగా గొప్ప సంకల్పానికి అనుగుణంగా జరుగుతుంది. ఉదయం క్యాంపస్‌లో ప్రారంభమైన ఈ వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిపాలనా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం సభా ప్రార్థనతో ప్రారంభమై, గురునానక్ యూనివర్సిటీ రెక్టర్ డా. కలైరాసన్ ఉపన్యాసం ద్వారా యోగా యొక్క ప్రాముఖ్యతను, సమతుల్య జీవనశైలి మరియు అంతఃశాంతి పరిరక్షణలో దాని పాత్రను వివరిస్తూ ప్రారంభించారు. యోగా గురువు నేతృత్వంలో వార్మప్, ఆసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానంతో కూడిన యోగా సెషన్ నిర్వహించారు. "తనకోసం, మనకోసం మరియు సమాజం కోసం యోగా" అనే శీర్షిక ద్వారా ఈ సంవత్సరం థీమ్‌కు అనుగుణంగా, మానసిక ఏకాగ్రత, శరీర సాధన, మరియు ఒత్తిడి నివారణపై దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్. శ్రీనాథ్ రెడ్డి (డైరెక్టర్, GNITC), డా. సంజీవ్ శ్రీవాస్తవ (డైరెక్టర్, GNIT), డా. పార్థసారథి (జాయింట్ డైరెక్టర్), డా. కే. వెంకటరావు (ప్రిన్సిపల్), డా. రేణుక బి. వై. (ప్రిన్సిపల్, హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ & హాస్పిటల్), జొయంత సర్కార్ జీ ఏం మరియు ఇతర విభాగ అధిపతులు పాల్గొని యోగా యొక్క గ్లోబల్ ప్రాముఖ్యతను, మరియు ప్రపంచానికి భారత్ అందించిన ఈ గొప్ప సంప్రదాయాన్ని గురించి మాట్లాడారు. గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్, గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, గురునానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ విద్యారంగంలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, యోగా వంటి సంప్రదాయాలను విద్యావ్యవస్థలో భాగంగా చేయాలనే తమ సంకల్పాన్ని తమ సందేశం ద్వారా వ్యక్తం చేశారు. ఈ యోగా దినోత్సవం జరుపుకున్న తీరు గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మరియు గురునానక్ యూనివర్సిటీ సామూహిక ఆరోగ్యానికి, జ్ఞానపరమైన చైతన్యానికి ప్రాధాన్యతనిచ్చే దృక్పథాన్ని ప్రతిబింబించింది. విద్యార్థులు యోగా పట్ల తమ అనుభవాలు పంచుకుంటూ, యోగా ఆధారిత సాంస్కృతిక ప్రదర్శనను చేశారు.

## భద్రాచలం ముంపు తప్పనిసరి ప్రశ్నే

- జాయింట్ సర్వే చేపట్టాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ కవిత
- పోలవరం ప్రభావిత ప్రాంతాలపై రాష్ట్రాల సీఎంల భేటీకి మునుపు కీలక సమావేశం

**హైదరాబాద్, మహా.** భద్రాచలం పట్టణం మున్ముందు నలుగా ముంపు బెదిరికిలో ఉండటమే కాకుండా శ్రీరామచంద్రుని దేవస్థాన భవితవ్యంపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి స్థాయిలో ముంపు పరిధిని ఆవిష్కరించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపు, భద్రాచలం రక్షణ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి అంశాలపై పలువురు ప్రముఖులు ఈ చర్చలో పాల్గొన్నారు. ఈ నెల 25న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరగనున్న పోలవరం అంశంపై నాలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో భద్రాచలం సమస్యకు పరిష్కారం దొరకాలనే లక్ష్యంతో ఈ సమావేశం జరిగిందని ఆమె పేర్కొన్నారు. భద్రాచలం పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో భాగంగా ఉండి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీలను — యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు — తిరిగి తెలంగాణలో కలపాలని తీవ్రంగా డిమాండ్ చేశారు.

**విభజన చట్టం ఉల్లంఘనపై ఆగ్రహం.**

విభజన చట్టం ప్రకారం పోలవరం ముంపులో 136 గ్రామాలు మాత్రమే ఉంటాయని స్పష్టం చేసిన కవిత, కేంద్రం ఏ విధంగానూ అదనంగా ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయడం చట్ట విరుద్ధమని విమర్శించారు. "2014లో మోదీ గారు ప్రధానమంత్రి అయ్యాకే కేంద్రం ఆ నిర్ణయం తీసుకుంది. ఇది నైతికంగా, రాజ్యాంగ పరంగా సరైనది కాదన్నది ప్రతి తెలంగాణ వాసి గుండె గుబ్బతో గుర్తుంచుకోవాలి" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**పురుషోత్తపట్నంలో రామాలయ భూములపై జాగ్రత్తలు తీసుకోండి**

పురుషోత్తపట్నంలో శ్రీరాముల వారి భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సమాచారం ఉందని పేర్కొన్న కవిత, "ఆ భూములను సంరక్షించేందుకు, అక్కడి సాంస్కృతిక విలువలను కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆ భద్రతా లోపం నుండి చరిత్రే బాధపడుతుంది" అని హెచ్చరించారు.

**జాగృతి తరపున కోర్టులో న్యాయపోరాటం.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే జాగృతి సంస్థ తరపున పోలవరం ముంపుపై కోర్టులో కేసులు వేశామని గుర్తుచేసిన కవిత, "మేము అప్పటినుండే ఈ సమస్యను సీరియస్‌గా తీసుకున్నాం. ఇప్పుడు తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం మరింత సమర్థంగా పోరాడతాం" అని స్పష్టం చేశారు. కేంద్రం తక్షణమే రాష్ట్రాల మధ్య సమన్వయం చేసి న్యాయబద్ధమైన పరిష్కారం తీసుకురావాలని కోరారు.

**బయ్యారం ఉక్కు పరిశ్రమపై కేంద్రానికి ప్రశ్న.**

బయ్యారం ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిష్క్రియంగా ఉందని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత, "ఉక్కు పరిశ్రమ ఏర్పడితే, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు వస్తాయి. కానీ దీన్ని సైతం గాలికొదిలేయడం తెలంగాణపై కేంద్ర నిర్లక్ష్యానికి నిదర్శనం" అని తీవ్రంగా విమర్శించారు.

**సమ్మేళన తీర్మానం.. భద్రాచలంపై ప్రత్యేకంగా చర్చించాలి**

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులంతా ఏకగ్రీవంగా భద్రాచలం సమస్యపై ప్రధానమంత్రి అధ్యక్షతన జరగనున్న రాష్ట్రాల సీఎంల సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరగాలని తీర్మానించారు. జాతీయ జలవనరుల కమిషన్, కేంద్ర జలవనరుల శాఖలు ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తీర్పు తేలేదెప్పుడో కానీ పోరాటం ఆగదు**

"తెలంగాణ ప్రజల అన్యాయాన్ని ఎదుర్కొనాలంటే మాటలతో కాదు.. ఉద్యమాలతోనే సాధ్యం. భద్రాచలాన్ని, శ్రీరాముడి ఆలయాన్ని రక్షించుకునే బాధ్యత మన అందరిదీ. పోలవరం ముంపును మిగిలిన ప్రాంతాల్లోనూ సమగ్రంగా అధ్యయనం చేయకుండా మేము మౌనంగా ఉండం" అని కవిత ప్రకటించారు.



## ఘనంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పెళ్లిరోజు వేడుకలు

**వరంగల్ తూర్పు :** రాజ్యసభ సభ్యులు పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర వివాహ వార్షికోత్సవం సందర్భంగా రవిచంద్ర యూత్ వింగ్ ఆధ్వర్యంలో ప్రముఖ దేవస్థానమైన శ్రీ ఓరుగల్లు భద్రకాళి దేవాలయంలో వేద పండితులు నాగరాజ్ శర్మ, అరవింద్ శర్మ ఆధ్వర్యంలో రవిచంద్ర విజయలక్ష్మి గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం తో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు, అనంతరం దేవాలయ ప్రాంగణంలో సుమారు 1000 మంది భక్తులకు అన్నదాన ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగత సహాయకులు వీణవంక కిరణ్ కుమార్, యూత్ వింగ్ సభ్యులు సిరిమల్ల కిరణ్, ఏరుకొండ వినయ్. నాగపురి రమేష్ గౌడ్. నానావరపు సందీప్, వడ్లకొండ శ్రీకర్ గౌడ్. మహేష్. శివాజీ. శ్రవణ్. ఆరెల్లి సుభాష్. చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డి అరెస్ట్ కు భారాసా ఆందోళన చేపట్టడం సిగ్గుచేటు

### చిన్న దొంగకు పెద్ద దొంగ మద్దతు పలకడం హాస్యాస్పదం




**హన్మకొండ మహా;** హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్ పై బిఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టడం సిగ్గుచేటు అని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. హనుమకొండలోని డీసీసీ భవన్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్న దొంగకు పెద్ద దొంగ మద్దతు ఇవ్వడం హాస్యాస్పదం" అని వారు ధ్వజమెత్తారు. బెదిరింపులకు పాల్పడి, దోచుకొని, మోసం చేస్తూ.. అడిగితే 'జై తెలంగాణ' ఉద్యమం పేరుతో అధికారం చలాయిస్తున్న బీఆర్ఎస్ నాయకుల తీరును నాయిని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "దోచుకున్న నాయకుడిని అరెస్ట్ చేస్తే ఎందుకు ఇంత హడావిడి చేస్తున్నారు? తెలంగాణ వనరులను దోచుకున్న నాయకులందరూ జైలుకు పోవడం ఖాయమని అమెరికా నుంచి వచ్చిన దొంగల ముఠా నాయకుడి విచారణలో మరిన్ని వాస్తవాలు బయటపడుతాయి. కేవలం 'జై తెలంగాణ' అంటే మీరు చేసిన తప్పులు పోతాయా? బెదిరింపులకు పాల్పడిన నాయకుడిని అరెస్ట్ చేస్తే, అది అక్రమ అరెస్ట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. పైగా మా పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. భారాస నాయకులు తిన్న ప్రతి పైసాను కక్కిస్తామని చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి 'జై తెలంగాణ' నినాదం ఎత్తడం సిగ్గుచేటని, ఉద్యమాల పేరుతో ప్రజలను నాడు మోసం చేసి నేడు డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. పాలించిన పదేళ్లలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, దేశంలోనే అతిపెద్ద ఫోన్ టాంపరింగ్ చేసి నిజరాజకీయ తెరలేపారని తీవ్రంగా విమర్శించారు. దేశం కోసం పోరాడిన యోధుల మాదిరిగా చట్టాన్ని అపహాస్యం చేయడం సరికాదన్నారు. చేసిన పాపాల పై అరెస్ట్ చేస్తే ఉద్యమం కార్డు అడ్డుపెట్టుకుని చెలరేగడం చాలా సిగ్గుచేటు అన్నారు. గతంలో ప్రజల పక్షాన నిలిచిన ప్రతిసారి అక్రమంగా అరెస్టులు చేసి జైల్లో పెడితే ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని గుర్తుచేశారు. ఇప్పటికైనా చట్ట ప్రకారంగా ఈ చీడపురుగులను శిక్షించాలని అధికారులను కోరారు. మీరు చేసిన తప్పులకు చట్టపరంగా చర్యలు తీసుకుంటుంటే మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబానికి తగిన బుద్ధి చెబుతారని ఘాటుగా విమర్శించారు. పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్‌కు ముఖ్యమంత్రికి సంబంధం ఉందా? అనే ప్రశ్నపై పరోక్షంగా స్పందించిన కాంగ్రెస్ నాయకులు, చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ యోగ దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ వన్నాల వెంకటరమణ

**వరంగల్ మహా;** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా బీజేపీ పార్టీ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమం వర్దన్నపేట, దేశాయిపేట లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు.




## భూపాలపల్లి జిల్లా కెమిస్ట్ &డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**భూపాలపల్లి మహా :** జయశంకర్ జిల్లా భూపాలపల్లి కెమిస్ట్ &డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూరు గ్రామంలో శనివారం జరిగాయి. ఈఎన్నికలలో జిల్లా నూతన అధ్యక్షుడుగా వంగర శ్రీనివాస్ (భూపాలపల్లి), జనరల్ సెక్రటరీగా పీచర రామకృష్ణ రావు (గారెపెల్లి), కోశాధికారిగా బండారి రమేష్ (భూపాలపల్లి) 2025 నుండి 2028 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ ,వరంగల్ జిల్లా అధ్యక్షులు ఏ మృత్యుంజయరెడ్డి , పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఎం వినోద్ ,ఎన్నికల పరిశీలకలగా తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజషన్ సెక్రటరీ కే రాజేందర్ అన్ని మండలాలకు సంబంధించిన మెడికల్ షాప్ యజమానుల పాల్గొన్నారు.

## డయేరియాపై అవగాహన సదస్సు

### సమావేశంలో పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం స్టాప్ డయేరియా కార్యక్రమం పై వరంగల్ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ వరంగల్ అధ్యక్షతన వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం ఈనెల 16 నుండి 31 వరకు జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల ప్రైవేటు పాఠశాలల్లో కూడా డయేరియా పై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వైద్య ఆరోగ్య సేవలు వినియోగించుకొని డయేరియా వ్యాధికి గురికాకుండా ఉండాలని తెలిపినారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో 78840 ఐదు సంవత్సరాల లోపు మంది పిల్లలు ఉన్నారు కాబట్టి ప్రతి శిశువుకు ఈ క్రింది లక్షణాలు తీవ్రనీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, వాంటింగ్స్, అస్వస్థత, మగతగా ఉండడం, జ్వరము ఉన్నట్లయితే వారికి ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు జింక్ టాబ్లెట్లు లేదా సిరప్ ఇస్తామని తెలిపారు . జిల్లాలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు రెండు లక్షలు, జింక్ టాబ్లెట్లు 25000, జింక్ సిరప్ బాటిల్స్ 2350, అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఓ ఆర్ ఎస్ తయారు చేయు విధానం, జింకు తీసుకునే విధానాన్ని గృహ సందర్శనకు వెళ్ళినప్పుడు తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం ఆరోగ్య కార్యక్రమాల పై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సాధారణంగా వర్షాకాలంలో కలుషితమైన నీరు కలుషితమైన ఆహారం వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం వల్ల ఈగల వలన ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పై లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో తగిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. వివిధ శాఖలు వైద్య ఆరోగ్య శాఖ తో సమన్వయపరచు కొని ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, డిప్యూటీ డిఎండిహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆచార్య, డాక్టర్ అర్చన, డాక్టర్ విజయకుమార్, మున్సిపాలిటీ ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, వర్ధన్నపేట మున్సిపాలిటీ కమిషనర్ సుధీర్ ,సి డబ్ల్యూ ఓ రాజమణి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నుండి వచ్చిన సుజన్ తేజ, డి ఆర్ డి సూపరింటెండెంట్ భవాని,డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.




## జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా సిఐటియు పోరాటం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** శనివారం సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె బుక్ లేట్లను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని, లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా సిఐటియు ఇతర కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు, ఇన్సూరెన్స్ సంఘాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కార్మికులు అందరూ కూడా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ రాజు, ఎం చంద్రమోహన్, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్, జిల్లా కమిటీ సభ్యులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి దేవస్థానంలో కొలువు తీరిన పాలక వర్గం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ మహా;** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానానికి ఒక సంవత్సర కాలపరిమితికి గాను తెలంగాణా ప్రభుత్వంచే నియమించబడిన ధర్మకర్తల నూతన మండలి ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ శేషభారతి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో ధర్మకర్తలచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ధర్మకర్తల మండలికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యంను అధ్యక్షులుగా అలాగే ధర్మకర్తలుగా తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి , ఓరుగంటి పూర్ణ చందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు, ఎక్స్ ఆఫీషియో మెంబర్ పార్నంది నర్సింహమూర్తిల చే నిబంధనల మేరకు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధర్మకర్తలందరిని అభినందిస్తూ కండువాలు కప్పి సత్కరించారు. అనంతరం నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ధర్మకర్తలందరూ దేవస్థాన చైర్మన్ తో కలసి దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలని ఈ ఓ, అర్చకులు, సిబ్బంది సమన్వయంతో ఆలయ వ్యవహారాలు ధర్మబద్ధంగా నిర్వహించాలని, ఆలయంలోని ఆచార సంప్రదాయాలకు భంగం కలిగే విధంగా వ్యవహరించ కూడదని ఆలయ ప్రాంగణంలో ఆలయ పరిపాలనా నిర్వహణలో రాజకీయాలకు తావియ్యకుండా ఆలయ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని సభాముఖంగా ధర్మకర్తలను కోరారు. అలాగే ఉత్సవాల్లో ముందుండి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం కొత్తగా నియమింపబడిన ధర్మకర్తలను అభిమానులు పూలమాలలతో, శాలువలతో, పుష్పగుచ్ఛాలతో ముంచెత్తారు. అలాగే దేవీ నవరాత్రులు భక్తులు రద్దీగా ఉన్న సందర్భాలలో ట్రాఫిక్ నియంత్రణలో ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేసిన మట్వాడ సి.ఐ గోపిని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధానార్చకులు భద్రకాళి శేషు, 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మీ సురేందర్, ఈవి శ్రీనివాస్, దేవాలయ అర్చకులు, సిబ్బంది, వందలాది మంది భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ దిక్సూచి ప్రొఫెసర్ జయశంకర్ సార్

### కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా జయశంకర్ వర్ధంతి



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ మార్గదర్శకుడు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని కడ్తాల్ మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా జయశంకర్ వర్ధంతిని స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమానికి పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక నేతలతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలిలు సమర్పించి నివాళులర్పించారు. జయశంకర్ ఆశయాలను తెలంగాణ సాధనకు వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. యాచక దశ నుంచి శాసించే దశకు తెలంగాణ రావాలె! అనేసంకల్పంతో జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. మా తెలంగాణ మాగ్గావాలె, అంటూ తెలంగాణే ధ్యాస, శ్వాసగా తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికే అంకితం చేశారని వారి సేవలను కొనియాడారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ రైతు కోఆర్డినేటర్ మంగల్పల్లి నరసింహ, మాజీ వార్డు సభ్యులు కేశని మహేష్, గురిగళ్ళ రామచంద్రయ్య, మూడ అశోక్, పాండు నాయక్, క్యామ వెంకటేష్, సిద్దిగారి వెంకటేష్,మూడ రవి,అమృతం పాండు, సిద్దిగారి దాసు, మొగిళ్ళ చెన్నయ్య, అంజి, శ్రీను, సురేష్, శ్రీకాంత్, కృష్ణ, రమేష్ ,కుమార్, కరుణాకర్, రాఘవ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మన ప్రాచీన జ్ఞాన సాంప్రదాయానికి నిదర్శనం యోగ

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** మన ప్రాచీన జ్ఞాన సాంప్రదాయానికి నిదర్శనం యోగ అని, చారిత్రాత్మక ప్రదేశంలో యోగా చేయడం మన సాంస్కృతి గొప్పతనాన్ని గుర్తు చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్, పురావస్తు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ కోటలోని కీర్తి తోరణాల మధ్య దాదాపు 1000 మందితో నిర్వహించిన యోగ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లా నాయక్ తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఈ సంవత్సరం 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ అనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. యోగ విశిష్టత దాని ప్రాముఖ్యత దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి కలెక్టర్ వివరించారు. ఆధ్యాత్మిక అనుభూతికి ప్రతి ఒక్కరు యోగాను జీవనశైలిలో అలవర్చుకోవాలన్నారు. మన ప్రాచీన జ్ఞాన సాంప్రదాయానికి యోగ నిదర్శనమని, ఆరోగ్యానికి జీవ ఔషధమని కలెక్టర్ తెలిపారు. తనువు మనస్సు ఆత్మను ఏకం చేసే సాధనమే యోగా అన్నారు. యోగా అనేది ఒక సంపూర్ణ జీవన విధానం అని మన ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరమైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాకు ఉదయం కొంత సమయాన్ని కేటాయించాలని శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులతో కలిసి యోగా ఆసనాలు చేశారు.

## పట్నంలో పర్యటించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని దండుమైలారం, ముకునూరు, రాయపోల్, పోల్కంపల్లి గ్రామాలలో సుమారు రెండు కోట్ల వ్యయంతో శనివారం ఆర్ అండ్ బి, పంచాయతీ రోడ్లకు, అండర్ డ్రైనేజ్ వ్యవస్థకు శంకుస్థాపన చేసి, రాయపోల్, పోల్కంపల్లి అనుబంధ గ్రామం మాన్యంగూడలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. అంగన్వాడి పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహార నాణ్యత గురించి సిడిపిఓ వినీత దేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ గురించి, అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రాయపోలు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేను కలిసిన మండల బిజెపి నాయకులు, గ్రామంలోని ప్రధాన దారి గురించి వివరించారు. ఇబ్రహీంపట్నం, రాయపోల్, దండుమైలారం మీదుగా విజయవాడ హైవేకు వెళ్లే ప్రధాన దారి అధ్వానంగా మారిందని, వర్షం కురిస్తే పరిస్థితి చిత్తడి చిత్తడిగా ఉంటుందని, యొక్క రోడ్డు పనులను ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బిజెపి నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే మండలంలోని రైతులకు రైతు భరోసా నిధులు, పంట కాలానికి అందేలా కృషి చేయాలని వారు ఎమ్మెల్యేని కోరారు. నియోజకవర్గంలో మండలాలలోని, గ్రామాలలో అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం, ముక్కునూరు, రాయపోల్, పోల్కంపల్లి గ్రామాలలో సుమారు రెండు కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి రోడ్లను కు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, అలాగే రాయపోల్ మాన్యంకూడా గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మండలంలో 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రతి ఒక్కరు ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత గడువులోపు, ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

